
E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 06-06-2025 (వారం) శుక్రవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



ఐదు రెట్లు పెరిగిన రాత్రి వేడి » 3లో

## ఉద్యోగులకు రెండు డీఏలు..



- తక్షణమే ఒకటి చెల్లింపు.. 6 నెలల తర్వాత రెండో డీఏ
- మళ్లీ జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ కమిటీలు
- ఉద్యోగులకు వైద్య సదుపాయం కోసం ట్రస్ట్
- ప్రతి నెలా రూ. 700 కోట్ల మేర ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపు
- సచివాలయంలో 12.5 శాతం నాన్ సెక్రటేరియట్ సర్వీసెస్ కోటా
- అంగన్‌వాడీల పదవీవిరమణ ప్రయోజనం రూ. 2 లక్షలకు పెంపు
- ఎన్నికల్లో బదిలీ అయిన ఉద్యోగులు తిరిగి సొంత స్థానాలకు బదిలీ
- హామ్ విధానంలో రాష్ట్రంలోని అన్ని రోడ్ల అభివృద్ధి
- కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్యంతో మెట్రో రైలు విస్తరణ

ఈకబురు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2 డీఏలు (కరువు భత్యం) చెల్లించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. 2023 జనవరి 1 నుంచి బకాయి ఉన్న డీఏలలో ఒక డీఏను తక్షణమే చెల్లించాలని నిర్ణయించింది. నాటి నుంచి ఇప్పటివరకు చెల్లించాల్సిన డీఏ బకాయిలను 28 వాయిదాల్లో చెల్లించనుంది. ఇక మరో డీఏను 6 నెలల తర్వాత చెల్లించనుంది. వచ్చే ఏప్రిల్‌లో దీనిపై ప్రకటన చేయనుంది. ఉద్యోగులకు 5 పెండింగ్ డీఏలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉండగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుతానికి రెండు డీఏలపైనే కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గం ఈ మేరకు పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంది. సాయంత్రం 4:30 నుంచి రాత్రి 9:30 గంటల వరకు జరిగిన ఈ సమావేశంలో ఉద్యోగులకు సంబంధించిన అపరిష్కృత సమస్యలపై విస్తృతంగా చర్చించి సానుకూల నిర్ణయాలు తీసుకుంది. ఉద్యోగుల సమస్యలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘానికి నేతృత్వం వహించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సచివాలయంలో విలేకరులకు వివరాలను వెల్లడించారు.

**ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘ చర్చ..**

ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల వివరాలను డిప్యూటీ సీఎం భట్టి కేబినెట్‌కు నివేదించారు. ఉద్యోగుల డిమాండ్లపై మే 6న ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ తమ నివేదికను సమర్పించింది. ఉద్యోగుల 57 డిమాండ్లను పరిశీలించిన మంత్రివర్గం.. అధికారుల కమిటీ నివేదిక ప్రకారం కొన్ని అంశాలను ఆమోదించి మిగిలిన వాటిని పరిశీలనకు స్వీకరించింది. ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను ఇకపై ప్రతి నెలా క్రమపద్ధతిలో చెల్లించాలని నిర్ణయించింది. ప్రతి నెలా రూ. తరువాయి 2లో

## మావోయిస్టు సుధాకర్ ఎన్‌కౌంటర్



- మరో పెద్ద నేతను కోల్పోయిన మావోయిస్టు పార్టీ
- పార్టీ కేంద్ర కమిటీసభ్యుడిగా కొనసాగుతున్న సుధాకర్
- ఛత్తీస్‌గఢ్ ఇంద్రావతి అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పుల్లో మృతి
- 2004లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వంతో శాంతి చర్చలకు వచ్చిన సుధాకర్

ఈ కబురు, ఏలూరు/ చర్ల: మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఉన్న ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో గురువారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, విప్లవ రాజకీయ పాఠశాల ఇన్‌చార్జ్ తెంటు లక్ష్మీ నరసింహాచలం (67) మరణించాడు. ఆయనకు గౌతమ్ అలియాస్ సుధాకర్ అలియాస్ ఆనంద్ అలియాస్ చంటి అలియాస్ రామరాజు అలియాస్ బాలకృష్ణ అలియాస్ అరవింద్ అనే పేర్లు కూడా ఉన్నాయి.సుధాకర్ పేరుతో పార్టీలో ఆయన సుప్రసిద్ధుడు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మరణించి నెల తిరక్కముందే మరో కీలక నేతను కోల్పోవటంతో ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలినట్టయ్యింది. తరువాయి 2లో

## ఇంట్లో సిందూర మొక్కను నాటిన మోడీ..

### 200 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన మోడీ



ఈ కబురు: పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోడీ ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో సిందూర్ మొక్కను నాటారు. స్వయంగా మట్టి తీసి మోడీ ఈ మొక్కను నాటి దానికి నీళ్లు పోశారు.అనంతరం దీనికి సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఏక్ పేడ్ మాకే నామ్ అంటూ తన పోస్ట్‌కు మోడీ క్యాప్షన్ ఇచ్చారు. రెండో దశ కార్యక్రమంలో భాగంగా 10వేల మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఇక ఈ మొక్కను ప్రధాని గుజరాత్ పర్యటనలో ఉన్న సమయంలో 1971 ఇండో పాకిస్థాన్ యుద్ధంలో పోరాడిన మహిళలు బహూకరించారు. తరువాయి 3లో

## ఇంగ్లాండ్ టూర్‌లో బుమ్రాకు రెస్ట్.. గంభీర్ ఏమన్నాడంటే?

» 6లో



## 12 దేశాల పౌరుల రాకపై అమెరికాలో నిషేధం



ఈ కబురు: రెండోసారి అధికారంలోకి వచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. తాజాగా యూఎస్‌కు వచ్చే 12 దేశాల పౌరుల రాకపై నిషేధం విధించారు. బుధవారం దీనికి సంబంధించిన ఉత్తర్వులపై ఆయన సంతకం చేశారు. తరువాయి 3లో

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేతో ఏం పని?



- నాగర్‌కర్నూలు ఎంపీ మల్లు రవిపై మాజీ ఎమ్మెల్యే సంపత్ ఫిర్యాదు
- 'నాగర్‌కర్నూలు' సమీక్షలో పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ దృష్టికి..
- ఐఏఎస్, ఐపీఎస్‌లు పట్టించుకోవడం లేదన్న మహబూబ్‌నగర్ నేతలు

ఈ కబురు, హైదరాబాద్: అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడును నాగర్‌కర్నూలు ఎంపీ మల్లు రవిని ఇంటికి పిలిపించుకొని మాట్లాడాల్సిన అవసరం ఏంటని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేతో కలిసి ఎంపీ తిరుగుతున్నారంటూ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. » 2లో

## చైనీస్ దోశ లాంటిది ఆధునిక ప్రేమ!

» 5లో



## నేటి నుంచి బడిబాట



- నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా బడిబాట
- ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెంచటమే లక్ష్యం
- సర్కారీ స్కూళ్లపై విశ్వాసం పెంచేలా కార్యక్రమాలు
- సర్కారు బడుల్లో ఏటా తగ్గుతున్న ప్రవేశాలు
- దశాబ్దకాలంలో 24 లక్షల నుంచి 16 లక్షలకు తగ్గుదల
- స్కూళ్లలో విద్యా ప్రమాణాలు పడిపోవటమే కారణమనే విమర్శలు

ఈ కబురు, హైదరాబాద్: ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల ప్రవేశాలు పెంచేందుకు విద్యాశాఖ రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నుంచి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది. ఈ నెల 19 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను అన్ని జిల్లాలకు పంపింది. అన్ని స్థాయిల అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సూచించింది. ప్రభుత్వ టీచర్లలో బోధనా సామర్థ్యం పెంచేందుకు ఈసారి శిక్షణ కూడా ఇచ్చారు. తరువాయి 2లో

## దాచటం దేశభక్తిని చాటడమా?




**దేశభక్తి ఎంత అవసరమో, స్వప్రయోజనాల కోసం ఆ భావనను మితిమీరిన స్థాయికి తీసుకెళ్లి చూడటం అంత అనర్థదాయకం. 'ఆపరేషన్ సిందూర్' క్రియాశీలకంగా మే 10న ముగిసిన 20 రోజులకు 31వ తేదీన ఈ విషయం బాగా స్పష్టమైంది.**

ఈ కబురు:ఆ రోజున భారతదేశపు త్రివిధ దళాధిపతి, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సి.డి.ఎస్.) జనరల్ అనిల్ చౌహాన్ సింగపూర్‌లో 'బ్లూమ్‌బర్గ్' టీవీకి ఇంటర్వ్యూ ఇస్తూ, 'ఆపరేషన్ సిందూర్'లో భారత వైమానిక దళం యుద్ధ విమానాలు కూలిన మాట నిజమేనని ఎట్టకేలకు అంగీకరించారు. దానితో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా సుడిగాలిలా చర్చ చెలరేగింది.

రఫేల్ కూలిందనగానే కలకలం

యుద్ధాలు జరిగినపుడు రెండు వైపులా నష్టాలు ఏదో ఒక మేర వాటిల్లటం సహజం. అమెరికా వంటి అత్యంత శక్తిమంతమైన దేశం సైతం చిన్న చిన్న దేశాల చేతిలో నష్టపోయిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం మన యుద్ధ విమానాల నష్టాల వార్తలు ప్రపంచమంతటా వ్యాపించిపోయినా, అలాంటిదేమీ జరగలేదంటూనే వచ్చింది. పైగా, పహల్‌గామ్ దురంతం, ఆపరేషన్ సిందూర్‌ల దరిమిలా దేశంలో పెల్లుబికిన దేశభక్తి రాజకీయ ప్రయోజనంగా మారుతుండగా, దాన్ని అంతులేని విధంగా పొందేందుకు రకరకాల ప్రయత్నాలు జరిగాయి. యుద్ధ విమానాల నష్టాలను దాచిపెట్టటం వాటిలో ఒకటి. మే 6-7 తేదీల మధ్య 'ఆపరేషన్' మొదలై పాకిస్తాన్‌లోని ఉగ్ర వాద స్థావరాలపై భారత వైమానిక దాడులు విజయవంతంగా జరి గాయి. ఆ వెంటనే పాకిస్తాన్ సైన్యం తాము ఆ దాడి సమయంలో భారత్‌కు చెందిన 5 విమానాలను (మర్నాడు ఆరుకు పెంచారు) కూల్చివేశామని ప్రకటించింది. వాటిలో భారత్‌కు ఫ్రాన్స్ సరఫరా చేసిన రఫేల్ విమానాలు మూడు, రష్యా నుంచి వచ్చిన మిగ్‌లు రెండు, మరొకటి ఉన్నాయని పాకిస్తాన్ కనీస వివరాలు కూడా ఇచ్చింది. ఆ వార్త ప్రపంచం అంతటా సంచలనంగా మారింది.

అందుకు కారణం మిగ్‌ల కన్నా ఎక్కువగా రఫేల్ విమానాలు కూలి పోవటం! రఫేల్ విమానాలకు ఉన్న పేరు, మనం వాటిని ఖరీదు చేసినప్పుడు వర్ణించిన వాటి శక్తి సామర్థ్యాల గురించి తెలిసిందే.

అందువల్ల, మరీ ముఖ్యంగా పాక్ వైమానిక బలం సాధారణమైన దనే అభిప్రాయం మనలో ఉన్నందున, పాకిస్తాన్ ప్రకటన నమ్మ శక్యం కానిదయింది. గమనించవలసిందేమంటే, ఆ ప్రకటనకు భారత సైన్యం అవునని గానీ, కాదని గానీ స్పందించకపోవటం. తరువాయి 2లో



## నేడు కాళేశ్వరం కమిషన్ ముందుకు ఈటల

- కాళేశ్వరం బరాజ్‌ల నిర్మాణంలో పాత్రపై ప్రశ్నించే అవకాశం
- పార్టీ మారడంతో ఈటల వాంగ్మూలంపై సర్వత్రా ఆసక్తి
- 9న హరీశ్‌రావు, 11న కేసీఆర్‌ను విచారించనున్న కమిషన్

»3లో

## హైదరాబాద్ కు మరో ప్రతిష్ఠాత్మక కంపెనీ..

రాఫెల్ యుద్ధ విమాన భాగాల యూనిట్



» 3లో

### బెంగళూరు తొక్కిసలాట ఘటనపై హైకోర్టు ఆగ్రహం

## కేసు విచారణ సీఐడీ చేతికి..!




***ఈ కబురు,బెంగళూరు: బెంగళూరు తొక్కిసలాట ఘటనపై కర్ణాటక హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించిన హైకోర్టు.. గురువారం మధ్యాహ్నం విచారణ చేపట్టింది. తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కనీస ఏర్పాట్లు లేకుండా ఈవెంట్ ఎలా నిర్వహిస్తారని ప్రశించిన ధర్మాసనం.. ఈ నెల 10లోపు వివరణ ఇవ్వాలని నోటీసులు ఇచ్చింది.***

ఇంతటి భారీస్థాయి కార్యక్రమాలు జరుగుతుంటే ఎందుకు భద్రతా చర్యలు తీసుకోలేదంటూ సీజే ప్రశ్నించారు. అన్ని భద్రతా చర్యలు తీసుకున్నామని.. కానీ ఊహించని విధంగా ఘటన జరిగిందని అడ్వకేట్ జనరల్ తెలిపారు. స్టేడియంలో 21 గేట్లు తెరిచారా అంటూ కోర్టు ప్రశ్నించింది. ఘటనపై ప్రభుత్వానికి సంబంధించిన వివరాలను కోర్టుకు అడ్వకేట్ జనరల్ వివరించారు.

భద్రతాపరంగా అన్ని పటిష్టమైన చర్యలు చేపట్టామన్న ఏజీ.. విచారణకు ఆదేశించామని.. 15 రోజుల్లోనే ఘటనపై కోర్టుకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు. క్రికెటర్లకు సన్మానం చేయాలని నిర్ణయించింది ఎవరు?. సన్మానం చేయాలనుకుంది ఆర్సీబీనా? కర్ణాటక అసోసియేషనా? లేక ప్రభుత్వమా? అంటూ అడ్వకేట్ జనరల్‌కు న్యాయవాది సూటి ప్రశ్నలు వేశారు. జరిగిన ఘటనలో వాస్తవాలను కప్పిపుచ్చాలని చూస్తున్నారన్నారు. ఈ నెల 10లోపు వివరణ ఇవ్వాలని నోటీసులు ఇచ్చిన హైకోర్టు.. విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. తరువాయి 2లో

## దూసుకెళ్తున్న బంగారం ధర!

» 4లో





## ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం.. ఎలాంటి షరతుల్లేకుండా మద్దతిస్తా: కిమ్

ఉక్రెయిన్‌తో యుద్ధం విషయంలో రష్యాకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ పునరుద్ఘాటించారు.

» 3లో

మొదటి పేజీ తరువాయి

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేతో ఏం పని?



**గురువారం నాగర్‌కర్నూలు, మహబూబ్‌నగర్, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గాల సమావేశం గాంధీభవన్‌లో జరిగింది. పార్టీ నిర్మాణం, ప్రభుత్వ పథకాల ప్రచారంపై విశ్లేషణ వంటి అంశాలపై చర్చించారు. అయితే స్థానిక అంశాలపైనే మూడు నియోజకవర్గాల నాయకులు మాట్లాడినట్టు తెలిసింది.**

నాగర్‌కర్నూల్ సమావేశంలో ఎంపీ మల్లు రవిని లక్ష్యంగా చేసుకొని మాజీ ఎమ్మెల్యే సంపత్, ఆయన వర్గం నాయకులు మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేశారు. పదేళ్లు కష్టపడిన మమ్మల్ని పక్కన బెట్టి ఇతరులకు ప్రియార్టీ ఇస్తారా అని సంపత్ వర్గం మల్లు రవిపై ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

మహబూబ్‌గర్ పార్లమెంట్ సమావేశంలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ ప్రతినిధులుగా తాము చెప్పే విషయాలు అధికారులు వినడం లేదని మీనాక్షికి చెప్పినట్టు సమాచారం.

వరంగల్ పార్లమెంటు సమావేశంలో స్థానిక అంశాలను ఇన్‌చార్జ్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: మీనాక్షి నటరాజన్

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ మూడు నియోజకవర్గాల నాయకులకు దిశానిర్దేశం చేశారు. గాంధీభవన్‌లో మూడు నియోజకవర్గాలకు విడివిడిగా జరిగిన సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ పథకాల ప్రభావం క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తుందని, ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని రాబోయే ఎన్నికల్లో అనుకూలంగా మలచుకోవాలని సూచించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సీనియర్లు, జూనియర్లు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. సమావేశాల్లో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మూడు నియోజకవర్గాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. శుక్రవారం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశం జరగనుంది.

మొదటి పేజీ తరువాయి

# నేడు కాళేశ్వరం కమిషన్ ముందుకు ఈటల



ఈ కబురు, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ శుక్రవారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర మాజీ ఆర్థిక శాఖ మంత్రి, ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ను ప్రశ్నించనుంది. ఏడాది కాలంగా విచారణ జరుపుతున్న కమిషన్ ఎదుట ఓ ముఖ్య నేత హాజరై వాంగ్మూలనం ఇవ్వనుండడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. తొలి దఫా బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక శాఖ మంత్రిగా ఈటల రాజేందర్ పనిచేసినప్పుడే కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన కీలక నిర్ణయాలు జరిగాయి.

బరాజ్‌ల నిర్మాణం సైతం అప్పుడే ప్రారంభమై పూర్తయ్యింది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు స్థానంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాలని తీసుకున్న నిర్ణయంతో పాటు ప్యాకేజీలవారీగా కాళేశ్వరం ప్రాజెక్టు పనులకు ఆర్థిక అనుమతులు, ఆ తర్వాత పనుల అంచనాల సవరణకు అనుమతి, రుణ సమీకరణ కోసం కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ (కేఐపీసీఎల్) స్థాపనకు అనుమతుల జారీలో నాడు ఆర్థిక శాఖ కీలకంగా వ్యవహరించింది. ఈ నిర్ణయాల్లో ఈటల రాజేందర్ పాత్రపై ఆయన్ను కమిషన్ ప్రశ్నించే అవకాశం ఉంది. ప్రాజెక్టు నిర్మాణానికి అప్పట్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పలు కమిటీలకు ఈటల నేతృత్వం వహించగా, మరికొన్ని కమిటీల్లో ఆయన సభ్యుడిగా ఉన్నట్టు గుర్తించింది. ఈ వ్యవహారాల్లో ఆయన పాత్రపై కమిషన్ ప్రశ్నించనుంది. కమిషన్ ఎదుట ఈటల ఇవ్వనున్న వాంగ్మూలం కీలకంగా మారే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, కమిషన్ ఈ నెల 9న మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌ను, 11న మాజీ సీఎం కేసీఆర్‌ను క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరు కావాలని కోరింది. వారికి ఇప్పటికే సమన్లు పంపించింది. వాస్తవానికి ఈ నెల 5నే కేసీఆర్‌ను ప్రశ్నించేందుకు కమిషన్ సమన్లు పంపగా, ఆయన అనారోగ్య కారణాలు చూపి మరి కొంత సమయం కోరారు. దీంతో 11వ తేదీన రావాలని కోరింది.

మొదటి పేజీ తరువాయి

# ఉద్యోగులకు రెండు డీఏలు..



ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘ చర్చ..

ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల వివరాలను డిప్యూటీ సీఎం భట్టి కేబినెట్‌కు నివేదించారు. ఉద్యోగుల డిమాండ్లపై మే 6న ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ తమ నివేదికను సమర్పించింది. ఉద్యోగుల 57 డిమాండ్లను పరిశీలించిన మంత్రివర్గం.. అధికారుల కమిటీ నివేదిక ప్రకారం కొన్ని అంశాలను ఆమోదించి మిగిలిన వాటిని పరిశీలనకు స్వీకరించింది.

ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను ఇకపై ప్రతి నెలా క్రమపద్ధతిలో చెల్లించాలని నిర్ణయించింది. ప్రతి నెలా రూ. 700 కోట్లకు తగ్గకుండా బిల్లులు చెల్లించనుంది. ఉద్యోగుల హెల్త్ కార్డులకు సంబంధించి మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల అభ్యర్థన మేరకు హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

ప్రతి ఉద్యోగి నుంచి నెలకు రూ. 500 వసూలు చేయడంతోపాటు సమాన మొత్తాన్ని ప్రభుత్వ వాటాగా ట్రస్ట్‌కు చెల్లించనుంది. ట్రస్ట్ చైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యవహరించనుండగా ఇతర అధికారులు, ఉద్యోగుల ప్రతినిధులు సభ్యులుగా ఉండనున్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా ట్రస్ట్ ద్వారా వైద్య సదుపాయం కల్పించనున్నారు.

ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడానికి ఏటా సెప్టెంబర్‌లో శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ) సమావేశం నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది.

ఇక జిల్లా, రాష్ట్ర స్థాయిలో మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ కమిటీ ఏర్పాటు చేయాలన్న మరో కీలక డిమాండ్‌ను మంత్రివర్గం ఆమోదించింది. జాయింట్ స్టేట్ కౌన్సిల్, అసోసియేషన్లను గుర్తించేందుకు ఒప్పుకుంది. జీవో 317లో ఇంకా కొన్ని కేటగిరీలను చేర్చాలని నిర్ణయం తీసుకుంది. సచివాలయంలో ప్రస్తుతం పూర్తిగా సెక్రటరియేట్ సర్వీసెస్ ఉద్యోగులే పనిచేస్తుండగా ఇకపై 12.5 శాతం నాన్ సెక్రటరియేట్ సర్వీసెస్ కోటాను అమలు చేయాలనే మరో డిమాండ్‌ను మంత్రివర్గం ఆమోదించింది. పదవీవిరమణ పొందిన ఉద్యోగులను మళ్లీ నియమించరాదనే మరో డిమాండ్‌ను మంత్రివర్గం ఆమోదించింది. గ్రామ కార్యదర్శి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించింది. ఎన్నికల సందర్భంగా ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉద్యోగులను సొంత జిల్లాలకు తిరిగి పంపించేందుకు అంగీకరించింది. జిల్లా పరిషత్‌లో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల పూర్తితోపాటు నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు డిమాండ్లకు సైతం సమ్మతి తెలిపింది. అంగన్‌వాడీల పదవీవిరమణ ప్రయోజనాలను రూ. 2 లక్షలకు పెంచింది. ఉద్యోగుల అద్దె వాహనాల పెండింగ్ బిల్లుల చెల్లింపుతోపాటు వాహనాల అద్దెల పెంపునకు ఆమోదం తెలిపింది.

మరికొన్ని నిర్ణయాలు

-భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేసిన ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరు పెట్టాలని నిర్ణయించింది.

-స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)కు రూ. 10 లక్షల ప్రమాద బీమా పథకాన్ని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అమల్లోకి తెచ్చింది. బీమా కంపెనీలకు చెల్లించాల్సిన ప్రీమియం భారం కాకుండా ప్రభుత్వమే నేరుగా బాధితులకు రూ. 10 లక్షలు చెల్లించాలని నిర్ణయించింది. ఇప్పటివరకు 385 మంది మరణించగా రూ. 38.5 కోట్ల చెల్లింపులకు మంత్రివర్గం ఆమోదించింది.

- హైబ్రీడ్ యాన్యూటీ మోడ్ (హామ్) కింద రాష్ట్రంలోని అన్ని (పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ) రోడ్లను అభివృద్ధి చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. తొలి దశ కింద 7,947 కి.మీ. పంచాయతీరాజ్, 5,190 కి.మీ. ఆర్ అండ్ బీ రోడ్లు కలిపి మొత్తం 13,137 కి.మీ. రోడ్లను అభివృద్ధి చేయనుంది. పంచాయతీరాజ్ రోడ్లకు రూ. 16,780 కోట్లు, ఆర్ అండ్ బీ రోడ్లకు రూ. 16,414 కోట్లు ప్రభుత్వం ఖర్చు పెట్టనుంది. వచ్చే రెండున్నరేళ్లలో రోడ్ల నిర్మాణం పూర్తి చేయనుండగా 15 ఏళ్లపాటు నిర్వహణ బాధ్యతలను ఏజెన్సీలకే ప్రభుత్వం అప్పగించనుంది. పార్లమెంట్ స్థానాన్ని ఒక యూనిట్‌గా లేదా ఉమ్మడి జిల్లాలవారీగా ఒక్కో జిల్లాను ఒక్కో ప్యాకేజీగా విభజించి రోడ్ల అభివృద్ధి చేయాలని నిర్ణయం.

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో రూ. 19,579 కోట్లతో అంచనాలతో హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. కారిడార్-1లో భాగంగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 39.6 కి.మీ., కారిడార్-2లో భాగంగా జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి మేడ్చల్ వరకు 24.5 కి.మీ., కారిడార్-3లో భాగంగా జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి శామీర్‌పేట్ వరకు 22 కి.మీ. కలిపి మొత్తం 86.1 కి.మీ. కారిడార్‌ను నిర్మించనుంది. ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ ఈ విషయంలో కేంద్రాన్ని ఒప్పించాలని మంత్రి పొంగులేటి కోరారు.

- రాష్ట్రంలో సన్న ధాన్యం పండించే రైతులకు ప్రోత్సాహాన్ని కొనసాగించాలని.. ప్రజలకు మేలు చేసే కార్యాక్రమాలకు గ్రీన్ చానల్‌లో చెల్లింపులు జరపాలని నిర్ణయించింది.

-ములుగు జిల్లా ఇంచర్ల గ్రామంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు 12 ఎకరాల కేటాయింపును మంత్రివర్గం ఆమోదించింది.

## తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు

- * కొత్తగూడెంలోని ఎర్త్ సైన్స్ వర్సిటీకి మన్మోహన్ సింగ్ పేరు పెట్టాలని నిర్ణయం
- * మహిళా స్వయం సహాయక బృంద సభ్యుల ప్రమాద బీమా చెల్లింపునకు నిర్ణయం
- * మహిళా స్వయం సహాయక బృంద సభ్యులు మరణిస్తే రూ.10 లక్షలు ఇచ్చేందుకు నిర్ణయం
- * 2024లో 385 మహిళా స్వయం సహాయక బృంద సభ్యులు మరణించారు
- * 385 మహిళల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున బీమా పరిహారం
- * హామ్ విధానంలో గ్రామీణ రోడ్ల ఆధునీకరణకు నిర్ణయం
- * సన్న వడ్లకు రూ.500 బోనస్ కొనసాగింపు
- * ప్రతీ గ్రామానికి బీటీ రోడ్లు వేయాలని నిర్ణయం
- * రెండు సంవత్సరాలలో రోడ్లు నిర్మాణం
- * మెట్రోను విస్తరించడానికి కేబినెట్ నిర్ణయం
- * 86.1 కిలోమీటర్లు.. 19 వేల 75 కోట్లతో మెట్రో విస్తరణ: పొంగులేటి

మొదటి పేజీ తరువాయి

# మావోయిస్టు సుధాకర్ ఎన్‌కౌంటర్


ఈ కబురు, ఏలూరు/ చర్ల: మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఉన్న ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో గురువారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, విప్లవ రాజకీయ పాఠశాల ఇన్‌చార్జ్ తెంటు లక్ష్మీ నరసింహాచలం (67) మరణించాడు. ఆయనకు గౌతమ్ అలియాస్ సుధాకర్ అలియాస్ ఆనంద్ అలియాస్ చంటి అలియాస్ రామరాజు అలియాస్ బాలకృష్ణ అలియాస్ అరవింద్ అనే పేర్లు కూడా ఉన్నాయి. సుధాకర్ పేరుతో పార్టీలో ఆయన సుప్రసిద్ధుడు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మరణించి నెల తిరక్కముందే మరో కీలక నేతను కోల్పోవటంతో ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలినట్టయ్యింది. కీలక నేతలున్నారన్న సమాచారంతో..: ఇంద్రావతి అటవీ ప్రాంతంలో సుధాకర్‌తోపాటు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాష్, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు పాపారావు, మరికొంతమంది కీలక నేతలు ఉన్నారన్న సమాచారంతో ఎస్‌టీఎఫ్, డీఆర్‌జీ, కోబ్రా విభాగాల ప్రత్యేక పోలీసు బలగాలు బుధవారం సాయంత్రం నుంచి పెద్ద ఎత్తున కూంబింగ్ చేపట్టాయి. గురువారం ఉదయం మావోయిస్టులు తారసపడటంతో ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయని, అనంతరం ఆ ప్రాంతంలో గాలించగా సుధాకర్ మృతదేహం లభించిందని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు. ఘటనా ప్రాంతం నుంచి ఏకే 47 తుపాకీ, మందుగుండు సామగ్రి, విప్లవ సాహిత్యం, ఇతర వస్తువులు బలగాలు స్వాదీనం చేసుకున్నాయి. సుధాకర్‌పై రూ.40 లక్షల రివార్డు ఉంది. శాంతి చర్చల్లో పాల్గొన్న సుధాకర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో నక్సలైట్లతో జరిగిన శాంతి చర్చల్లో సుధాకర్ పాల్గొన్నాడు. ఆయన స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా పెదపాడు మండలం సత్యవోలు. సుధాకర్ తండ్రి రామకృష్ణుడు, తల్లి సరస్వతి. వీరికి సుధాకర్ 6వ సంతానం. సత్యవోలులో సుధాకర్ సోదరుడు తెంటు ఆనందరావు నివసిస్తున్నారు. సుధాకర్ మృతితో స్వగ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయన చింతలపూడి మండలం ప్రగడవరంలో 10వ తరగతి, ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. విజయవాడలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో 1972లో చదువుతున్నప్పుడే మావోయిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితుడై అడవి బాట పట్టారు. చివరిసారిగా 1983లో తన తండ్రి అనారోగ్యానికి గురైతే చూద్దానికి వచ్చినపుడు సుధాకర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. జైలు నుంచి విడుదలై మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా పని చేస్తున్న సమయంలో 2013లో కేంద్ర కమిటీలో స్థానం దక్కింది. అనంతరం పార్టీ పబ్లికేషన్ విభాగానికి నాయకత్వం వహించాడు. సుధాకర్ 43 ఏళ్లపాటు మావోయిస్టు పార్టీలో పనిచేశారు. 2024-25 సంవత్సరంలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లలో మొత్తం 403 మంది మావోయిస్టులు మృతి చెందారని సుందర్‌రాజ్ వెల్లడించారు. **



మొదటి పేజీ తరువాయి

# దాచటం దేశభక్తిని చాటడమా?

పైగా, పహల్‌గామ్ దురంతం, ఆపరేషన్ సిందూర్‌ల దరిమిలా దేశంలో పెల్లుబికిన దేశభక్తి రాజకీయ ప్రయో జనంగా మారుతుండగా, దాన్ని అంతులేని విధంగా పొందేందుకు రకరకాల ప్రయత్నాలు జరిగాయి. యుద్ధ విమానాల నష్టాలను దాచి పెట్టటం వాటిలో ఒకటి. మే 6-7 తేదీల మధ్య 'ఆపరేషన్' మొదలై పాకిస్తాన్‌లోని ఉగ్ర వాద స్థావరాలపై భారత వైమానిక దాడులు విజయవంతంగా జరి గాయి. ఆ వెంటనే పాకిస్తాన్ సైన్యం తాము ఆ దాడి సమయంలో భారత్‌కు చెందిన 5 విమానాలను (మర్నాడు ఆరుకు పెంచారు) కూల్చివేశామని ప్రకటించింది. వాటిలో భారత్‌కు ఫ్రాన్స్ సరఫరా చేసిన రఫేల్ విమానాలు మూడు, రష్యా నుంచి వచ్చిన మిగ్‌లు రెండు, మరొకటి ఉన్నాయని పాకిస్తాన్ కనీస వివరాలు కూడా ఇచ్చింది. ఆ వార్త ప్రపంచం అంతటా సంచలనంగా మారింది.అందుకు కారణం మిగ్‌ల కన్నా ఎక్కువగా రఫేల్ విమానాలు కూలి



పోవటం! రఫేల్ విమానాలకు ఉన్న పేరు, మనం వాటిని ఖరీదు చేసినప్పుడు వర్ణించిన వాటి శక్తి సామర్థ్యాల గురించి తెలిసిందే.అందువల్ల, మరీ ముఖ్యంగా పాక్ వైమానిక బలం సాధారణమైనదనే అభిప్రాయం మనలో ఉన్నందున, పాకిస్తాన్ ప్రకటన నమ్మ శక్యం కానిదయింది. గమనించవలసిందేమంటే, ఆ ప్రకటనకు భారత సైన్యం అవునని గానీ, కాదని గానీ స్పందించకపోవటం. 'వ్యూహాత్మక పొరపాటు'గా ఒప్పుకోలుమరొక వైపు ప్రపంచ వార్తా సంస్థలు విచారణలు మొదలుపెట్టి భారత్ విమానాలు కూలిన మాట నిజమని ధ్రువీకరించాయి. మొదటైతే ఒక రఫేల్ విమానం కూలిన మాట వాస్తవమేనని స్వయంగా రఫేల్ ఉత్పత్తిదారైన ఫ్రెంచ్ దస్సాల్ట్ కంపెనీ తెలియజేసింది. ఆ వెంటనే అమెరికన్ ఇంటిలిజెన్స్ ధ్రువీకరించింది. ఇంతకూ రఫేల్‌ను కూల్చగలిగిన పాకిస్తాన్ యుద్ధ విమానాలు, క్షిపణులు ఏవి అనే విచారణను పాశ్చాత్య మీడియా సంస్థలు, నిఘా సంస్థలు జరిపినప్పుడు, అవి చైనా నుంచి పాకిస్తాన్ కొనుగోలు చేసిన జె-35 విమానాలని తేలింది. దానితో అందరూ ఉలిక్కిపడ్డారు. ఎందుకంటే చైనా స్వయంగా గత 40 ఏళ్లుగా ఎవరితోనూ వైమానిక యుద్ధాలు చేయలేదు. వారు ఆ విమానాలను విక్రయించిన మరే దేశమూ యుద్ధం చేయలేదు. కనుక వారి ఆయుధాల శక్తి ప్రపంచానికి డాక్యు మెంట్లలో చదవటం తప్ప ప్రత్యక్షంగా తెలియదు. ఆ శక్తి ఏమిటో ఇపుడు ప్రదర్శితం కావడంతో జె-35ను ఉత్పత్తి చేసిన చెంగ్‌దూ కంపెనీ స్టాక్స్ 48 గంటలలో 40 శాతం పెరగగా, దస్సాల్ట్ స్టాక్స్ 10 శాతానికి పైగా పడిపోయాయి. జె-35 కొనుగోలుకు వేర్వేరు దేశాల నుంచి ఆసక్తి వ్యక్తం అయింది. అయితే స్వయంగా ఆ కంపెనీ గానీ, చైనా గానీ ఎటువంటి వ్యాఖ్యలూ చేయలేదు. 'ఆపరేషన్ సిందూర్' మే 10న ఆగే నాటికి ఇదీ పరిస్థితి.వైమానిక నష్టాల గురించి విదేశాలలో ఎన్నెన్ని కథనాలు వెలువడుతున్నా, ఆ నష్టాలు తాము చేసినట్లు పాకిస్తాన్ పదే పదే ప్రకటి స్తున్నా, భారత ప్రభుత్వం మౌనం వహించింది. మే 11న భారత త్రివిధ దళాధిపతులు మీడియా సమావేశం నిర్వహించారు. ఒక విలేఖరి ప్రశ్నకు సమాధానంగా ఎయిర్ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ అయిన ఎయిర్ మార్షల్ ఎ.కె. భారతి - "యుద్ధంలో నష్టాలు సర్వ సాధారణం. యుద్ధం ఇంకా సాగుతున్నందున నేను ఆ వివరాల్లోకి వెళ్లబోను" అన్నారు. అదే ప్రశ్నను విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీకి వేయగా, "ఆ విషయాలు నాకు తెలియవు. కచ్చితమైన వివరాలను తగిన సమయంలో వెల్లడిస్తాము" అని జవాబిచ్చారు. ఆ మాటల అంతరార్థం తెలిసిపోతున్నా ప్రభుత్వం మాత్రం ఆ విషయం మాట్లాడేందుకు నిరాకరిస్తూనే పోయింది. ఆ 11వ తేదీ నుంచి 31 వరకు 20 రోజుల పాటు నష్టాల వివరాలు ప్రపంచానికంతా తెలిశాయి. సింగపూర్‌లో అయినా జనరల్ చౌహాన్, విమానాలు కూలా యన్నారు గాని ఎన్ని కూలాయో పేర్కొనలేదు. ఇక సైన్యాధికారులు 11న గాని, 31న గాని, మనం లక్ష్యాలను ఛేదించామా లేదా, దాడి సమయంలో జరిగిన వ్యూహాత్మక పొరపాటును గ్రహించి దిద్దుబాటు చేసుకున్నామా లేదా అనేవే ప్రధానమని అంటూ దాటవేయ బూనారు. ప్రభుత్వ విధానం అది గనుక వారినేమీ అనలేము.

దేశభక్తిని ప్రేరేపించే ప్రయత్నాలు!

ఏ యుద్ధంలోనూ ఏ దేశం కూడా సమగ్రమైన వివరాలు వెల్లడించదు. అందులో రక్షణపరమైన అంశాలు కొన్ని ఇమిడి ఉంటాయి గనుక! కానీ, ప్రస్తుత సందర్భంలో□పలు వివరాలు వెల్లడై సంచలనంగా మారుతున్నపుడు, మనం వాస్తవాలను అనవసరంగా దాచి పెడుతున్నామనే అభిప్రాయం ఏర్పడుతూ ప్రతిష్ఠకు భంగం వాటిల్లు తున్నప్పుడు, వాస్తవాలు ఏమిటని ప్రతిపక్షాలు పలుమార్లు ప్రశ్నిస్తున్నప్పుడు, పార్లమెంటరీ కమిటీలో ప్రస్తావించి ప్రత్యేక పార్లమెంట్ సమావేశం ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నపుడు ఇది సాధారణ పరిస్థితుల వంటిది కాబోదు.

కేంద్ర ప్రభుత్వం ఈ వాస్తవాలను గుర్తించి అందుకు తగినట్లు వ్యవహరించటానికి బదులు, వాస్తవాలు ప్రజలకు తెలిస్తే వారిలో దేశభక్తి తగ్గుతుందనీ, అది తగ్గితే రాజకీయ ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుందనీ అన్నట్లుగా ఉండిపోయింది.

ఇది చాలదన్నట్లు సింధూ నదీ జలాల ఒప్పందం, పీఓకేలను మోదీ ప్రభుత్వం బలంగా ముందుకు తెచ్చింది. ఈ లక్ష్యాలు నెరవేరటం ఆచరణలో ఎంత సాధ్యమన్నది అలా ఉంచి, పనిలో పనిగా వాటి పేరిట కూడా దేశభక్తిని స్థాయి పెంచి రాజకీయంగా లబ్ధి పొందాలన్న యోచన మాత్రం ప్రస్తుత ప్రభుత్వంలో స్పష్టంగా కనిపిస్తున్నది. ఉగ్రవాదాన్ని, దాని ప్రోత్సాహకులను దెబ్బతీయాలనటం వరకు నిర్వివాదమైన విషయం. ఇటువంటి సందర్భాలలో ప్రజల దేశభక్తి అత్యంత సహజం. అదేవిధంగా యుద్ధాలు జరిగి నపుడు ఏదో ఒక మేరకు రెండు వైపులా నష్టాలు అనివార్యం. అంతిమంగా చూడ వలసింది పైచేయి సాధించి లక్ష్యాలను ఆ మేరకు నెరవేర్చుకున్నామా లేదా అనేది మాత్రమే. 'క్రికెట్ మ్యాచ్‌లో పోయిన వికెట్లు ముఖ్యం కాదు, తుది ఫలితం ముఖ్యం' అంటూ ఆఖరికి జనరల్ చౌహాన్ వెల్లడించిందీ అదే! విషయాన్నంతా రాజ కీయ స్వప్రయోజనాల కోసం వినియోగించదలుచుకొని, రకరకాల పద్ధతులలో వాస్త వాలను దాచేందుకు ప్రభుత్వం మితిమీరి వ్యవహ రించటం సరి కాదు. 'అతి సర్వత్ర వర్జయేత్' అనే హితవు భారతీయ సంస్కృతిలో ఊరకనే రాలేదు.

మొదటి పేజీ తరువాయి

# నేటి నుంచి బడిబాట

**బడిబాట షెడ్యూల్ ఇదీ..**

**6వ తేదీ: స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులను భాగస్వా మ్యం చేస్తూ గ్రామసభలు నిర్వహించాలి.**

**7వ తేదీ: టీచర్లు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి బడి ఈడు పిల్లలను గుర్తించాలి.**

8, 9, 10 తేదీల్లో: అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన. డ్రాపౌట్ పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడంతోపాటు ప్రత్యేక అవస రాలున్న పిల్లలను గుర్తించి, అందుబాటులో ఉన్న భవిత కేంద్రాల్లో చేర్పించాలి.

11వ తేదీ: అప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష.

12వ తేదీ: అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టి న పనులను ప్రజాప్రతినిధులతో ప్రారంభించాలి. అదే రోజు వి ద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫామ్స్ అందించాలి.

13వ తేదీ: ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామస్తులను ఆహ్వానించి వారి సమక్షంలో సామూహిక అక్షరాభ్యాసం, బాలసభ నిర్వహించాలి.

16వ తేదీ: ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్), లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (లిప్) దినోత్సవం నిర్వహించాలి. అన్ని తరగతి గదుల్లో సబ్జెక్టులవారీగా అభ్యసన సామర్థ్యాలకు సంబంధించిన పోస్టర్లను ప్రదర్శించాలి. పిల్లలు రూపొందించిన వివిధ చార్టులతో గదులను అలంకరించాలి. చదవడం, గణిత అంశాలపై ఎఫ్‌ఎల్‌ఎన్ క్విజ్ పోటీలు నిర్వహించాలి. 17వ తేదీ: ఇంటిగ్రేటెడ్ విద్య. బాలిక విద్యా దినోత్సవం నిర్వహించాలి. బాల్య వివాహాలు, చిన్నారులపై వేధింపులకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించాలి.

18వ తేదీ: తల్లిదండ్రులను, గ్రామస్తులను ఆహ్వానించి తరగతి గదుల డిజిటలైజేషన్, ఇతర అధునిక సౌకర్యాలను చూపించాలి. మొక్కల పెంపకం ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించాలి.

19వ తేదీ: బడిబాట ముగింపు సందర్భంగా విద్యార్థులకు క్రీడల పోటీలు నిర్వహించాలి.

తగ్గుతున్న ప్రవేశాలు

ప్రభుత్వ స్కూళ్లలో గత పదేళ్లలో విద్యార్థుల ప్రవేశాలు 32 శాతం తగ్గాయి. 2014-15లో 24.85 లక్షల మంది ప్రభుత్వ స్కూళ్లలో చేరితే, 2024-25లో ఈ సంఖ్య 16.68 లక్షలకు తగ్గింది. అదే కాలంలో ప్రైవేటు స్కూళ్లలో ప్రవేశాలు 31.17 లక్షల నుంచి 36.73 లక్షలకు పెరిగింది.

ప్రభుత్వ స్కూళ్లలో విద్యా ప్రమాణాలు పడిపోవడం కూడా ప్రవేశాలు తగ్గటానికి కారణంగా భావిస్తున్నారు. కాగా, బడిబాటపై చాలామంది టీచర్లు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. తూతూమంత్రంగానే పాల్గొనేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది.



# ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం..
## ఎలాంటి షరతుల్లేకుండా మద్దతిస్తా: కిమ్



ఈ కబురు: ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో ఉత్తరకొరియా నుంచి రష్యాకు తిరుగులేని మద్దతు అందింది. బుధవారం పొంగ్యాంగ్‌లో ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ తో రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగు భేటీ అయ్యారు. ఈసందర్భంగా కీవ్‌తో యుద్ధానికి రష్యాకు తాము భేషరతుగా మద్దతిస్తున్నట్లు కిమ్ వ్యాఖ్యానించారు. ఈమేరకు అక్కడి అధికారిక మీడియా వెల్లడించింది .

'ఉక్రెయిన్‌తో యుద్ధం విషయంతో సహా అన్ని కీలకమైన అంతర్జాతీయ రాజకీయ సమస్యలలో రష్యా వైఖరినీ, ఆ దేశ విదేశాంగ విధానాలకు ఉ.కొరియా బేషరతుగా మద్దతిస్తోంది' అని కిమ్ పేర్కొన్నారు. ఈ భేటీలో ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతం వంటి పలు అంశాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నట్లు తెలుస్తోంది. కుర్స్క్ ప్రాంతం పునర్‌నిర్మించే అంశంపై కూడా మాట్లాడుకున్నారు. షోయిగు ఉ.కొరియాలో పర్యటించడం ఈ ఏడాదిలో ఇది రెండోసారి. ఆయన మార్చిలోనే ఈ దేశంలో పర్యటించి కిమ్‌తో భేటీ అయ్యారు. అప్పుడు కూడా రష్యా తన సార్వభౌమాధికారం, ప్రాంతీయ సమగ్రతను కాపాడుకునేందుకు చేస్తోన్న పోరాటంలో తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని కిమ్ స్పష్టంచేశారు.

రష్యా తరపున తమ బలగాలు ఉక్రెయిన్ సైన్యంతో పోరాడుతున్నాయనే విషయాన్ని ఈ ఏడాది ఏప్రిల్‌లో ఉ.కొరియా ధ్రువీకరించిన సంగతి తెలిసిందే. దీనికి కొన్నిరోజుల ముందే రష్యా కూడా ఈ విషయాన్ని వెల్లడించింది. రష్యాఉత్తర కొరియాల మధ్య జరిగిన పరస్పర రక్షణ ఒప్పందంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. ఎంతమంది సైన్యం ఉన్నారనే విషయం మాత్రం బయటపెట్టలేదు. అయితే, 1012వేల మందికిపైగా బలగాలు ఉండవచ్చని ఉక్రెయిన్ నిఘా సంస్థ, దక్షిణ కొరియా అధికారులు గతంలో పేర్కొన్నారు. దీనికి ప్రతిగా రష్యా అత్యాధునిక ఆయుధాలు, అత్యున్నత సాంకేతికతను కిమ్‌కు అందిస్తున్నట్లు తెలుస్తోంది. గత మూడేళ్లుగా రష్యా ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం కొనసాగుతోంది. దీనికి ముగింపు పలికేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఈ యుద్ధం ముగించి ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇస్తాంబుల్ వేదికగా ఇరుదేశాల మధ్య శాంతి చర్చలు కూడా జరుగుతున్నాయి.

### బెంగళూరు తొక్కిసలాట ఘటనపై హైకోర్టు ఆగ్రహం
# కేసు విచారణ సీఐడీ చేతికి..!

స్టేడియంలో 21 గేట్లు తెరిచారా అంటూ కోర్టు ప్రశ్నించింది. ఘటనపై ప్రభుత్వానికి సంబంధించిన వివరాలను కోర్టుకు అడ్వకేట్ జనరల్ వివరించారు.

భద్రతాపరంగా అన్ని పటిష్టమైన చర్యలు చేపట్టామన్న ఏజీ.. విచారణకు ఆదేశించామని.. 15 రోజుల్లోనే ఘటనపై కోర్టుకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు. క్రికెటర్లకు సన్మానం చేయాలని నిర్ణయించింది ఎవరు?. సన్మానం చేయాలనుకుంది ఆర్సీబీనా? కర్ణాటక అసోసియేషనా? లేక ప్రభుత్వమా? అంటూ అడ్వకేట్ జనరల్‌కు న్యాయవాది సూటి ప్రశ్నలు వేశారు. జరిగిన ఘటనలో వాస్తవాలను కప్పిపుచ్చాలని చూస్తున్నారన్నారు. ఈ నెల 10లోపు వివరణ ఇవ్వాలని నోటీసులు ఇచ్చిన హైకోర్టు.. విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

ఆర్సీబీ విజయోత్సవాల వేళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11మంది మృతి చెందిన ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనపై సమాచార హక్కు కార్యకర్త స్నేహమయి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై కబ్బన్ పార్క్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆర్సీబీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్స్, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్(కేఎస్‌సీఏ) సహా తొక్కిసలాటతో సంబంధం ఉన్న పలువురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నేరపూరిత నిర్లక్ష్యం కేసులో ఈ సంస్థలను నిందితులుగా పేర్కొని భారతీయ న్యాయ సంహితలోని ఐదు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు.

కేసు విచారణ సీఐడీ చేతికి..!

మరోవైపు, ఈ కేసు దర్యాప్తును సీఐడీకి బదిలీ చేస్తున్నట్లు కర్ణాటక ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు కోర్టుకు ఇచ్చిన స్టేటస్ రిపోర్టులో ఈ విషయాన్ని ప్రభుత్వం పేర్కొంది. సీఐడీకి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈ కేసును దర్యాప్తు చేస్తుందని తెలిపింది. తదుపరి దర్యాప్తు కోసం సిట్‌ను ఏర్పాటు చేయాలన్న ఆదేశాలతో పాటు ఎఫ్ఐఆర్ కాపీని సీఐడీకి అప్పగించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఈ విషాద ఘటనపై మెజిస్టీరియల్ విచారణ జరుపుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. తొక్కిసలాటకు కారణాలేంటి? తలెత్తిన లోపాలు, జవాబుదారీతనం వంటి అంశాలను పరిశీలించేందుకు డిప్యూటీ కమిషనర్, బెంగళూరు డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ 15 రోజుల్లోగా విచారణ చేస్తారని ప్రభుత్వం తెలిపింది.

స్టేడియం వద్ద 2.5లక్షల మంది ప్రజలు గుమిగూడారని, బెంగళూరు నగర పోలీసుల నుంచి 1380 మంది సిబ్బంది, 13 కేఎస్ఆర్‌పీ ప్లాటూన్లు (325మంది సిబ్బంది)ని మోహరించి విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వం తన నివేదికలో పేర్కొంది. కానీ, జనం భారీగా తరలిరావడంతో పలు గేట్ల వద్ద తొక్కిసలాట జరిగి 11మంది మృతిచెందగా.. 56మంది గాయపడ్డారని తెలిపింది. 1, 6, 7, 1721 గేట్ల వద్ద ప్రాణనష్టం జరిగినట్లు పేర్కొంది. వైద్య సహాయం వెంటనే అందించామని.. క్షతగాత్రుల్లో 50మంది అవుట్ పేషెంట్లుగా చికిత్స పొందగా, మరో ఆరుగురికి ఇంకా చికిత్స కొనసాగుతున్నట్లు పేర్కొంది.

స్టేడియం వద్ద పోలీస్ సిబ్బందితో పాటు మూడు అగ్నిమాపక వాహనాలు, రెండు అంబులెన్స్‌లు, రెండు డిశ్వాట్ యూనిట్లు, ఒక నీటి ట్యాంకర్, కమాండ్ కంట్రోల్ వాహనం మోహరించినట్లు ప్రభుత్వం తెలిపింది. మృతుల కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున పరిహారం ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం క్షతగాత్రులకు వైద్య ఖర్చులన్నింటినీ భరించినట్లు తెలిపింది. అలాగే, కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ సైతం మృతులకు రూ.5లక్షలు చొప్పున పరిహారం ఇస్తామని హామీ ఇచ్చింది.



## ఇంట్లో సిందూర మొక్కను నాటిన మోడీ.. 200 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన ప్రధాని



ఈ కబురు: పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోడీ ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో సిందూర్ మొక్కను నాటారు. స్వయంగా మట్టి తీసి మోడీ ఈ మొక్కను నాటి దానికి నీళ్లు పోశారు. అనంతరం దీనికి సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఏక్ పేడ్ మాకే నామ్ అంటూ తన పోస్ట్‌కు మోడీ క్యాప్షన్ ఇచ్చారు. రెండో దశ కార్యక్రమంలో భాగంగా 10వేల మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఇక ఈ మొక్కను ప్రధాని గుజరాత్ పర్యటనలో ఉన్న సమయంలో 1971 ఇండో పాకిస్థాన్ యుద్ధంలో పోరాడిన మహిళలు బహూకరించారు. ఆ మొక్కను తన నివాసంలోనే నాటుతానని ప్రధాని వారికి మాట ఇవ్వగా నేడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఇక ఈ వార్త వైరల్ అవ్వడంతో సిందూర్ మొక్క పత్యేకత ఏంటి అని నెటిజన్లు తెగ వెతికేస్తున్నారు. సాధారణంగా ఈ మొక్క ద్వారా వచ్చే నారింజ రంగును గిరిజనులు సౌందర్య సాధానంగా ఉపయోగిస్తారు. దీనితోనే భారతీయ మహిళలు నుదిటిన పెట్టుకునే సిందూర్ తయారు చేస్తారు. అంతే కాకుండా భారతీయ ఆయుర్వేదంలోనూ దీనిని ఉపయోగిస్తారు. తలనొప్పి, కఫం, అధిక జ్వరం, గోనేరియా, రక్త వ్యాధులను నివారించడానికి దీనిని ఉపయోగిస్తారు.

భారత ప్రధాని నరేంద్ర మోడీ ఢీల్లీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 200 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. ఢిల్లీ ప్రభుత్వం నేతృత్వంలో ఈ బస్సులు తయారు చేయగా.. పర్యావరణ అనుకూలమైన పట్టణ రవాణా పరిష్కారాల యొక్క అత్యవసర అవసరాన్ని ఇది హైలైట్ చేస్తుంది. ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె. సక్సేనా, ముఖ్యమంత్రి రేఖా గుప్తా, కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ వంటి ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మోడీ తన ప్రసంగంలో భారత పౌరులు, దేశాలు ఒక్కటై పర్యావరణ పరిరక్షణ కోసం కృషిని మరింత ఉత్తేజపరచాలని కోరారు. అలాగే భారతదేశ సాంస్కృతిక సంప్రదాయాలలో రూపుదిద్దుకున్న పర్యావరణ సమతుల్యత యొక్క ప్రాముఖ్యతను పునరుద్ఘాటించారు. ఈ సంవత్సరం పర్యావరణ దినోత్సవ థీమ్‌గా ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు భారత దేశంలో కొనసాగుతున్న చొరవలను ప్రధాని మోడీ ప్రశంసించారు. అంతకు ముందు ప్రధాని మోడీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని భగవాన్ మహావీర్ వనస్థలి పార్క్‌లో వేను ఒక మొక్కను నాటారు. ఈ సందర్భంగా దేశ పౌరులు వారి తల్లి పేరు మీద ఒక మొక్కను నాటడంతో పాటు దాని పెంపకం పై దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా ప్రధాని పిలుపునిచ్చారు.



# హైదరాబాద్‌కు
## మరో ప్రతిష్టాత్మక కంపెనీ.. రాఫెల్ యుద్ధ విమాన భాగాల యూనిట్



ఈ కబురు : తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరానికి మరో ప్రతిష్టాత్మక కంపెనీ రాబోతోంది. భారత్‌లో నెలకొల్పబోయే రాఫెల్ యుద్ధ విమాన భాగాల ఉత్పత్తి యూనిట్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం అయింది. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్, డసాల్ట్ ఏవియేషన్ కలిసి రాఫెల్ యుద్ధ విమానాల ఫ్యూజ్‌లేజ్ తయారీ కోసం నాలుగు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో అతి పెద్ద ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు ఒప్పందం కుదిరింది. ఇది ఫ్రాన్స్ బయట రాఫెల్ ఫ్యూజ్‌లేజ్‌లు తయారయ్యే తొలి యూనిట్ గా గుర్తింపు పొందనుంది. ఈ ఉత్పత్తి కేంద్రం 2028 నుంచి రాఫెల్ విమానాలకు కావాల్సిన లాటరల్ షెల్స్, సెంట్రల్, ఫ్రంట్ సెక్షన్‌లను తయారు చేస్తుంది. నెలకు రెండు ఫ్యూజ్‌లేజ్‌ల వరకూ ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంటుంది. ఈ ప్రాజెక్ట్ 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాల మేరకు ఏర్పాటు అవుతోంది. భారత్‌ను ప్రపంచ ఏరోస్పేస్ సరఫరా చెయిన్ లో కీ ప్లేయర్ గా మార్చనుంది. అలాగే స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ ఉద్యోగాలను కూడా కల్పిస్తుంది. శ్రామికుల నైపుణ్యాలను పెంచుతుంది. డసాల్ట్‌తో ఈ భాగస్వామ్యం భారత్‌తో 70 ఏళ్ల సంబంధాన్ని మరింత బలపరచనుంది. రాఫెల్ ఉత్పత్తిని మరింత వేగవంతం చేస్తుందని డసాల్ట్ ఎరిక్ ట్రాపియర్ తెలపగా.. ఈ ఒప్పందం భారత ఏరోస్పేస్ రంగంలో మైలురాయిగా నిలుస్తుందని సుకరన్ సింగ్ పేర్కొన్నారు. ఈ యూనిట్ కేవలం భారత్ కోసమే కాక ప్రపంచ మార్కెట్‌లకూ కూడా యుద్ధ విమాన విడి భాగాలను సరఫరా చేయనుంది.

# ఐదు రెట్లు పెరిగిన రాత్రి వేడి

**దేశంలో పెరుగుతున్న రాత్రి వేళ ఉష్ణోగ్రతలు**

**పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోనూ వేడి గాలులు**

**417 జిల్లాల్లో అత్యంత ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్న తాపం**

**201 జిల్లాల్లో మధ్యస్థంగా ఉష్ణోగ్రతలు**

**కేవలం 116 జిల్లాల్లోనే సాధారణ పరిస్థితులు**

**రాత్రి వేడి పెరుగుతున్న రాష్ట్రాల్లో టాప్–2లో ఏపీ**

**ఇంధన, పర్యావరణ, నీటి మండలి తాజా అధ్యయనంలో వెల్లడి**



ఈ కబురు:ఈ రేయి చల్లనిది అని పాడుకునే రోజులు పోయాయి. పగటి ఉష్ణోగ్రతలు మాదిరే రాత్రి కూడా వేడి వాతావరణం వేధించే రోజులు వచ్చేశాయి. అదీ చాలా ప్రమాదకర స్థాయిలో ఉండటం ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. రాత్రి వేడి వాతావరణం ఉండే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ టాప్-2లో ఉందని కేంద్ర ఇంధన, పర్యావరణ, నీటి మండలి (సీఈఈడబ్ల్యూ) చేసిన 'హౌ ఎక్స్‌ట్రీమ్ హీట్ ఇంపాక్టింగ్ ఇండియా' అనే తాజా అధ్యయనంలో వెల్లడైంది. తాజాగా విడుదలైన ఈ అధ్యయనం దేశంలో నాలుగు దశాబ్దాల వాతావరణ ఆధారిత ఉష్ణోగ్రతలను అంచనా వేసింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రాత్రిపూట వేడి పెరుగుతోందని హెచ్చరించింది. -సాక్షి, అమరావతి

ఐదు రెట్లు పెరిగిన రాత్రి వేడి

దేశ వ్యాప్తంగా 734 జిల్లాల్లో వేడి ప్రమాదకర స్థాయిని అంచనా వేయడానికి 35 సూచికలను సీఈఈడబ్ల్యూ ఉపయోగించింది. తద్వారా 417 జిల్లాల్లో అత్యధిక ప్రమాదకరంగా వేడి పెరుగుతున్నట్లు గుర్తించింది. వేడి ఉష్ణోగ్రతల ప్రమాదం స్థాయి 201 జిల్లాల్లో మధ్యస్థంగానూ, 116 జిల్లాల్లో తక్కువగానూ ఉన్నట్లు తేల్చింది. కాగా ఇందులో ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, గోవా, కేరళ, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, కర్ణాటక, తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లు టాప్ 10లో ఉన్నాయి. 1982-2011 బేస్ లైన్‌తో పోలిస్తే గత దశాబ్దం(2012-2022) 70 శాతం జిల్లాల్లో వేసవిలో ఐదు రెట్లు వేడి పెరిగింది. 10 శాతం తేమ పెరిగిందని కూడా ఈ అధ్యయనం తెలిపింది.

ఒక మెరుగైన ఇల్లు అంటే చలికాలంలో వెచ్చగా, వేసవిలో చల్లగా ఉండాలని ప్రముఖ గ్రీకు తత్వవేత్త సోక్రటీస్ అనేవారట. ఆధునిక నాగరికతకు ముందే భవనాలను చలికాలంలో సూర్యరశ్మిని గ్రహించేలా, వేసవిలో నీడ ఎక్కువగా ఉండేలా ఇళ్లను నిర్మించేవారు. మళ్లీ అలాంటి సాంకేతికతతో భవన నిర్మాణాలు చేయాల్సిన ఆవశ్యకత నెలకొంది.

పగలూ రాత్రీ ఏకమైపోతాయి

గత ఐదు దశాబ్దాల్లో 700కు పైగా వేడి తరంగాల కారణంగా 17 వేల మంది మరణించారని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) ఇటీవల వెల్లడించింది. ఎక్కువకాలం ఉండే వేడి రాత్రుల యుగంలోకి ప్రవేశిస్తున్నామని సీఈఈడబ్ల్యూ అధ్యయనం ఇప్పుడు హెచ్చరించింది.

ఈ పరిస్థితులను వెంటనే అర్థం చేసుకుని వాతావరణాన్ని చల్లబరిచేందుకు అత్యవసర చర్యలు చేపట్టకపోతే కొన్నేళ్లకు సూర్యుడు అస్తమించే సమయం తగ్గిపోతుందని, అంటే రాత్రి కూడా పగలుగానే మారిపోతుందని అధ్యయనం స్పష్టం చేసింది. హీట్ యాక్షన్ ప్లాన్స్(హెచ్ఏపీ) జాతీయ స్థాయిలో చేపట్టాల్సిన సమయం ఆసన్నమైందని చెబుతోంది.

# 12 దేశాల పౌరుల రాకపై అమెరికాలో నిషేధం

**12 దేశాల పౌరుల రాకపై నిషేధం విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉత్తర్వులపై సంతకం చేశారు.**

ఈ కబురు: రెండోసారి అధికారంలోకి వచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. తాజాగా యూఎస్‌కు వచ్చే 12 దేశాల పౌరుల రాకపై నిషేధం విధించారు. బుధవారం దీనికి సంబంధించిన ఉత్తర్వులపై ఆయన సంతకం చేశారు.

కొలరాడోలో ఇటీవల యూదులపై సీసాబాంబులతో దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలోనే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అఫ్గానిస్థాన్, ఇరాన్, యెమెన్, మయన్మార్, చాద్, కాంగో, ఈక్వెటోరియల్ గినియా, ఎరిట్రియా, హైతీ, లిబియా, సోమాలియా, సూడాన్ దేశాలు ఈ నిషేధ జాబితాలో ఉన్నాయి. కాగా.. బురుండి, క్యూబా, లావోస్, సియెరా లియోన్, టోగో, తుర్కమేనిస్థాన్, వెనెజువెలా వంటి మరో ఏడు దేశాలపై పాక్షిక నిషేధం విధించారు. ఈ ఉత్తర్వులు సోమవారం నుంచి అమల్లోకి వస్తాయని వైట్‌హౌస్ అధికారులు తెలిపారు.

'కొలరాడోలోని బోల్డర్ కౌంటీలో ఇటీవల ఉగ్రదాడి జరిగింది. సరైన పత్రాలు లేని విదేశీ పౌరులు దేశంలో ఉండటం కారణంగానే.. మన మాతృభూమిలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. 2017లో యూరప్‌లో జరిగిన విధంగా అమెరికాలో జరగనివ్వం. సురక్షితం కానీ దేశాల నుంచి బహిరంగ వలసలను ఇక అనుమతించలేము. అందుకే ఈ రోజు యెమెన్, సోమాలియా, హైతీ, లిబియాతో సహా పలు దేశాల ప్రయాణికులపై నిషేధం విధించే ఉత్తర్వులపై సంతకం చేస్తున్నా' అని ట్రంప్ ఓ వీడియోలో పేర్కొన్నారు. కాగా.. ట్రంప్ మొదటిసారి పదవి చేపట్టిన సమయంలోనూ పలు ముస్లిం దేశాలపై నిషేధం విధించారు. 2017లో యూరప్‌లో జరిగిన ఉగ్రదాడిని గురించి ఆయన ప్రస్తావించారు.

తక్షణ శాంతి అసాధ్యం

ఈ ప్రకటనపై వెనిజువెలా మంత్రి డియోస్డాడో కాబెల్లో స్పందించారు. యూఎస్‌లో ఉండటం వెనిజువెలా ప్రజలకు మాత్రమే కాదు.. ఎవరికైనా ప్రమాదమే అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా తమ దేశ పౌరులు అగ్రరాజ్యంలో పర్యటించవద్దని సూచించారు. ఇక, ట్రంప్ చేసిన ఈ ప్రయాణ నిషేధానికి చట్టపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

విదేశీ విద్యార్థుల వీసాలు పరిమితం

ట్రంప్ , హార్వర్డ్ విశ్వవిద్యాలయం మధ్య విభేదాలు తీవ్రతరమవుతున్నాయి. ఈక్రమంలోనే తాజాగా ట్రంప్ మరో కీలకమైన ఉత్తర్వులపై సంతకం చేశారు. ఆ యూనివర్సిటీలో చదవాలనుకునే విదేశీ విద్యార్థుల వీసాలను పరిమితం చేసే ఉత్తర్వులు అవి. అమెరికా ప్రయోజనాలకు హాని కలిగించే వారు మాకు వద్దంటూ.. హార్వర్డ్ అలాంటివారికి నిలయంగా మారిందని వ్యాఖ్యానించారు. అయితే, ఈ తాజా ఉత్తర్వులు హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి మాత్రమే వర్తిస్తోందని, దేశంలోని ఇతర సంస్థలకు కాదని యూఎస్ విదేశాంగ శాఖ పేర్కొంది.



## సీఐడీ అడిషనల్ డీజీగా చారుసిన్హా బాధ్యతలు



ఈ కబురు: క్రైమ్ ఇన్వేస్టిగేషన్ డిపార్టమెంట్ (సీఐడీ) అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఏడీజీపీ)గా చారుసిన్హా గురువారం బాధ్యతలు స్వీకరించారు. మహిళా భద్రత, షీ టీమ్, భరోసా విభాగాలకు సంబంధించి పూర్తి అదనపు బాధ్యతలు కూడా ఆమె నిర్వహించనున్నారు. చారుసిన్హా 1996 బ్యాచ్ ఐపిఎస్ అధికారి. కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్ )లో ఏడు సంవత్సరాల విశిష్ట సేవల తర్వాత ఆమె తెలంగాణకు తిరిగి వచ్చారు. బీహార్, జమ్మూ కాశ్మీర్‌లో ఆమె పని చేశారు. బీహార్, జమ్మూ, కాశ్మీర్ దక్షిణ రంగాలలోని సీఆర్పీఎఫ్ లోని 4 విభాగాలకు నాయకత్వం వహించిన మొదటి ఐపిఎస్ అధికారిగా ఆమె గుర్తింపు పొందారు.

# 1,000 డాలర్లు చెల్లిస్తే తొందరగా వీసా ఇంటర్వ్యూ: ట్రంప్ కార్యవర్గం యత్నాలు

ఈ కబురు: అమెరికా వీసా ఇంటర్వ్యూల కోసం ఏళ్లతరబడి ఎదురుచూడకుండా.. ఓ ప్రత్యేక విధానం ప్రవేశపెట్టాలని ట్రంప్ కార్యవర్గం భావిస్తోంది. 1,000 డాలర్లు చెల్లించిన వారికి వీసా ఇంటర్వ్యూ వేగంగా ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలిస్తోంది. అతి త్వరలోనే దీనిని అమల్లోకి తీసుకొచ్చే అవకాశాలున్నాయి.

ఈ మేరకు ఓ ప్రణాళికను విదేశాంగశాఖ అంతర్గత మెమోలో ప్రస్తావించారు. దీనిని ఓ అమెరికా అధికారి కూడా ధ్రువీకరించారు. నాన్ ఇమిగ్రెంట్ వీసా దరఖాస్తుదారులు, పర్యాటకులు ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజుగా 1,000 డాలర్లు చెల్లిస్తే.. వేగంగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ప్రస్తుతం పర్యాటకులు, నాన్ ఇమిగ్రెంట్ వీసాదారులు ప్రాసెసింగ్‌ఫీజు కింద 185 డాలర్లను చెల్లిస్తున్నారు. దీనికి అదనంగా ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజ్‌ను ఏర్పాటుచేస్తున్నారు. ఈమేరకు జారీ అయిన అమెరికా విదేశాంగశాఖ అంతర్గత మెమోను ఓ ఆంగ్లవార్త సంస్థ సంపాదించింది. సదరు డిపార్ట్‌మెంట్లోని న్యాయ నిపుణులను ఇది చాలా రిస్క్‌తో కూడుకొన్నదిగా దానిపై వ్యాఖ్యానించినట్లు చెప్పినట్లు తెలుస్తోంది. ఈ ప్లాన్‌ను శ్వేతసౌధం బడ్జెట్ ఆఫీస్ లేదా న్యాయస్థానాలు నిలిపివేసే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ ప్లాన్‌ను ప్రయోగాత్మకంగా డిసెంబర్ నాటికి మొదలుపెట్టే అవకాశం ఉంది. వాస్తవానికి ట్రంప్ గోల్డ్ కార్డ్‌ను ప్రకటించేనాటికి ఈ ప్రతిపాదన తెర పైకి రాలేదు. ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజుపై స్పందించేందుకు అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి నిరాకరించారు. "నాన్ ఇమిగ్రెంట్ వీసాల ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్లు డైనమిక్ విధానంలో జరుగుతున్నాయి. మేము ప్రపంచవ్యాప్తంగా మా కార్యకలాపాల సామర్థ్యాలను మెరుగుపర్చుకోవాలని ప్రయత్నిస్తున్నాం" అని వ్యాఖ్యానించారు. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన నాటినుంచి వలస విధానాల్లో మార్పులు తెచ్చేందుకు తీవ్రస్థాయిలో యత్నిస్తున్నారు. విద్యార్థి వీసాలు, వెట్టింగ్ ప్రోటోకాల్స్‌లో మార్పులు చేశారు. తాజాగా యూఎస్‌కు వచ్చే 12 దేశాల పౌరుల రాకపై నిషేధం విధించారు. బుధవారం దీనికి సంబంధించిన ఉత్తర్వులపై ఆయన సంతకం చేశారు. ఇప్పుడు వీసా ప్రాసెస్‌లో ప్రీమియం సేవలను ప్రారంభించాలని భావిస్తున్నారు. 2023 ఆర్థిక సంవత్సరంలో అమెరికా 10.4 మిలియన్ల నాన్ ఇమిగ్రెంట్ వీసాలను జారీ చేసింది.






## సరిహద్దు దేశాలకు ఎఫ్‌డీఐ విధానం అదే!

**భారత్‌తో సరిహద్దును పంచుకునే దేశాలతో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ) విధానంలో ప్రభుత్వం ఎటువంటి సవరణలు చేయలేదని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.**

**ఎటువంటి సవరణలు చేయలేదు**

**దిల్లీ:** భారత్‌తో సరిహద్దును పంచుకునే దేశాలతో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ) విధానంలో ప్రభుత్వం ఎటువంటి సవరణలు చేయలేదని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఈ దేశాల్లోని పెట్టుబడిదార్లు భారత్‌లో ఏదేని రంగంలో పెట్టుబడులు పెట్టాలంటే.. ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని 2020లో ప్రెస్ నోట్ 3ని ప్రభుత్వం జారీ చేసింది. భారత్‌తో సరిహద్దులను పంచుకునే దేశాలన్నింటికీ ఈ ప్రెస్ నోట్ 3 సమానరీతిలో వర్తిస్తుందని ఆ వర్గాలు చెప్పాయి. చైనా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, భూటాన్, నేపాల్, మయన్మార్, అఫ్గానిస్థాన్ లాంటి దేశాలు ఇందులో ఉన్నాయి. ఈ దేశాల నుంచి వచ్చే ఎఫ్‌డీఐ ప్రతిపాదనల పరిశీలన నిర్దేశిత అనుమతుల జారీ ప్రక్రియ ప్రకారం ఒకే తరహాలో జరుగుతుందని ఆ వర్గాలు వెల్లడించాయి. 'ఈ ప్రెస్ నోట్ జారీ అనంతరం భారత్‌తో సరిహద్దును పంచుకునే దేశాల నుంచి వచ్చే పెట్టుబడులకు సంబంధించి ఎఫ్‌డీఐ విధానంలో ఎటువంటి సవరణలు చేయలేద'ని ఆ వర్గాలు వెల్లడించాయి. చైనా నుంచి వచ్చే ఎఫ్‌డీఐ దరఖాస్తుల అనుమతి ప్రక్రియను భారత్ సులభతరం చేసిందంటూ కొన్ని వార్తలు రావడంతో పై స్పష్టతను సంబంధిత వర్గాలు ఇచ్చినట్లుగా కనిపిస్తోంది. ప్రస్తుతం ప్రెస్ నోట్ 3 కింద దరఖాస్తుల పరిశీలనను హోం శాఖ కార్యదర్శి నేతృత్వంలోని అంతర్ మంత్రిత్వ కమిటీ నిర్వహిస్తోంది.



## దూసుకెళ్తున్న బంగారం ధర!

స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇటీవల తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతున్న బంగారం ధరల్లో మార్పులొస్తున్నాయి. అయితే నిన్నటి మార్కెట్ ధరలతో పోలిస్తే ఈ రోజు రేట్లు పెరిగాయి. వివిధ ప్రాంతాల్లో గురువారం రోజున గోల్డ్ రేట్లు ఎలా ఉన్నాయో ఈ కథనంలో తెలుసుకుందాం. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, ప్రొద్దుటూరు, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో ఒక తులం బంగారం ధరలు రూ.91,300 (22 క్యారెట్స్), రూ.99,600 (24 క్యారెట్స్) వద్ద ఉన్నాయి. నిన్నటి ధరలతో పోలిస్తే ఈ రోజు 10 గ్రాముల బంగారం ధర వరుసగా ఏకంగా రూ.400, రూ.430 పెరిగింది. చెన్నైలో గురువారం 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధరలు రూ.400, 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.430 పెరిగింది. దీంతో గోల్డ్ రేటు రూ.91,300 (22 క్యారెట్స్ 10 గ్రామ్స్ గోల్డ్), రూ.99,600 (24 క్యారెట్స్ 10 గ్రామ్ గోల్డ్)కు చేరింది. దేశ రాజధాని నగరం దిల్లీలో బంగారం ధర నిన్నటితో పోలిస్తే పెరిగింది. ఈ రోజు 10 గ్రాముల 22 క్యారెట్స్ పసిడి ధర రూ.400 పెరిగి రూ.91,450కు చేరుకోగా.. 24 క్యారెట్ల ధర రూ.430 పెరిగి రూ.99,750 వద్దకు చేరింది.

**వెండి ధరలు**

బంగారం ధరల మాదిరిగానే గురువారం వెండి ధర(Silver Prices)ల్లో మార్పులు వచ్చాయి. కేజీ వెండిపై ఏకంగా రూ.1,000 పెరిగింది. దాంతో కేజీ వెండి ధర రూ.1,14,000 వద్దకు చేరింది.





## లాభాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు

**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గడిచిన సెషన్‌తో పోలిస్తే గురువారం లాభాల్లో కదలాడుతున్నాయి. ఈ రోజు ఉదయం 10:06 సమయానికి నిఫ్టీ127 పాయింట్లు పెరిగి 24,747కు చేరింది. సెన్సెక్స్ 406 పాయింట్లు ఎగబాకి 81,408 వద్ద ట్రేడవుతోంది.**



అమెరికా డాలర్ ఇండెక్స్ 98.85 పాయింట్ల వద్దకు చేరింది. బ్రెంట్ క్రూడ్‌ఆయిల్ బ్యారెల్ ధర 64.67 అమెరికన్ డాలర్ల వద్ద ఉంది. యూఎస్ 10 ఏళ్ల బాండ్ ఈల్డ్‌లు 4.36 శాతానికి చేరాయి. అమెరికా మార్కెట్లు గడిచిన సెషన్‌లో స్వల్ప లాభాల్లో ముగిశాయి. ఎస్ అండ్ పీ గత సెషన్‌తో పోలిస్తే 0.01 శాతం లాభపడింది. నాస్‌డాక్ 0.32 శాతం పుంజుకుంది.

ప్రధానంగా బ్లూచిప్ కౌంటర్లలో నిన్నటి మార్కెట్‌లో కొనుగోళ్ల కారణంగా దేశీ స్టాక్ మార్కెట్లు బలపడ్డాయి. దీంతో మూడు రోజుల వరుస నష్టాలకు చెక్ పడింది. అంచనాలను మించిన యూఎస్ ఉపాధి గణాంకాలకుతోడు టారిఫ్‌లపై యూఎస్, చైనా వాణిజ్య చర్చలు సెంటిమెంటుకు జోష్‌నిచ్చినట్లు నిపుణులు పేర్కొన్నారు. నిన్నటి మార్కెట్‌లో ఎన్ఎస్ఈలో మెటల్, ఆయిల్ రంగాలు 0.6 శాతం పుంజుకోగా.. రియల్టీ 0.7 శాతం నీరసించింది.

**రూపాయి నేలచూపు**

దేశీ కరెన్సీ రెండో రోజు డీలా పడింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో డాలరుతో మారకంలో రూపాయి 26 పైసలు క్షీణించి 85.87 వద్ద నిలిచింది. రూపాయి 85.69 వద్ద ప్రారంభమై 86.05 వరకూ పతనమైంది. మంగళవారం సైతం రూపాయి 22 పైసలు కోల్పోయి 85.61 వద్ద ముగిసిన విషయం విదితమే. వెరసి రెండు రోజుల్లో 48 పైసలు నష్టపోయింది. కాగా.. ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు ఇండెక్స్ 99.11కు చేరింది.

## బెస్ట్ క్యాష్ బ్యాక్, రివార్డు పాయింట్లు ఇచ్చే క్రెడిట్ కార్డులు




చదువు పూర్తి చేసుకొని ఉద్యోగం సంపాదించిన కొద్ది నెలల్లోనే బ్యాంకు సిబ్బంది ఫోన్ చేసి 'సర్.. క్రెడిట్ కార్డు తీసుకుంటారా? చాలా బెనిఫిట్స్ ఉన్నాయి. లైఫ్ టైమ్ ఫ్రీ.. మీ శాలరీ బేస్ చేసుకుని కార్డు ఇస్తున్నాం' అని చెబుతుంటారు. డబ్బు అవసరం లేనివారికి ఈ కార్డు ఒక వనరుగా పనిచేస్తే.. మనీ నిత్యం అవసరం ఉండేవారికి మాత్రం ఇదో సంకటంగా మారతుందనే వాదనలున్నాయి. ఏదేమైనా క్రెడిట్ కార్డు వాడుతుంటే రివార్డ్ పాయింట్లు, క్యాష్‌బ్యాక్ రూపంలో ఎంతోకొంత ప్రయోజనం చేకూరుతుంది. ప్రస్తుతం కొన్ని ప్రముఖ బ్యాంకులు తమ వినియోగదారులకు ఎలాంటి ప్లాయింట్లు అందిస్తున్నాయో తెలుసుకుందాం.

క్యాష్ బ్యాక్ & రివార్డు పాయింట్లు ఎస్‌బీఐ క్యాష్ బ్యాక్ క్రెడిట్ కార్డ్: ఆన్ లైన్ ఖర్చులపై 5% క్యాష్ బ్యాక్ ఆఫర్ అందిస్తుంది.

అమెజాన్ పే ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డ్: ప్రైమ్ మెంబర్‌లకు 5% క్యాష్ బ్యాక్‌తో ఎలాంటి ఛార్జీలు లేకుండా లైఫ్‌టైమ్ ఫ్రీ కార్డు.

హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డు: షాపింగ్, డైనింగ్‌పై క్యాష్ పాయింట్స్ అందిస్తుంది. ట్రావెల్ & లాంజ్ యాక్సెస్ కార్డులు హెచ్‌డీఎఫ్‌సీ డైనర్స్ క్లబ్ బ్లాక్ మెటల్ ఎడిషన్: అపరిమిత ఎయిర్ పోర్ట్ లాంజ్ యాక్సెస్, అధిక రివార్డు పాయింట్లు అందిస్తుంది. యాక్సిస్ బ్యాంక్ రిజర్వ్ క్రెడిట్ కార్డు: అపరిమిత దేశీయ, అంతర్జాతీయ లాంజ్ యాక్సెస్ ఇస్తున్నారు. యాక్సిస్ అట్లాస్ క్రెడిట్ కార్డ్: ప్రయాణ ఖర్చుల్లో రాయితీలు పొందవచ్చు.

ఇదీ చదవండి: దూసుకెళ్తున్న బంగారం ధర!

**ప్రీమియం, లైఫ్‌స్టైల్ కార్డులు**

హెచ్‌డీఎఫ్‌సీ గోల్డ్ క్రెడిట్ కార్డు: ఎంపిక చేసిన బ్రాండ్లపై ఐదు రేట్లు రివార్డ్ పాయింట్లు అందిస్తుంది. అమెక్స్ ప్లాటినం ట్రావెల్ కార్డ్: ప్రత్యేక ప్రయాణ ప్రయోజనాలు, హోటల్ మెంబర్‌షిప్ పొందవచ్చు.

## ఐపీవోకు 6 కంపెనీలు రెడీ

**జాబితాలో హెచ్‌డీబీ ఫైనాన్షియల్ డార్ఫ్–కెటల్ కెమికల్స్, విక్రమ్ సోలార్**

**క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా ఆరు కంపెనీల ఐపీవో ప్రణాళికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ జాబితాలో ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అనుబంధ సంస్థ హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్‌సహా డార్ఫ్–కెటల్ కెమికల్స్, విక్రమ్ సోలార్ తదితరాలు చేరాయి.**

ఈ ఆరు కంపెనీలు పబ్లిక్ ఇష్యూల ద్వారా ఉమ్మడిగా రూ. 20,000 కోట్లకుపైగా సమీకరించాలని ప్రణాళికలు వేశాయి. 2024 అక్టోబర్- 2025 జనవరి మధ్య సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. సెబీ అనుమతి పొందిన జాబితాలో ఏవన్ స్టీల్స్ ఇండియా, శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్, శ్రీజి షిప్పింగ్ గ్లోబల్ సైతం ఉన్నాయి. గత నెలలో వచ్చిన ఐదు ఐపీవోలతో కలసి 2025లో ఇప్పటివరకూ 16 కంపెనీలు లిస్టింగ్ బాటలో సాగడం గమనార్హం!

**రూ. 12,500 కోట్లపై కన్ను**

ఐపీవోలో హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ. 2,500 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా రూ. 10,000 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆఫర్ చేయనుంది. ఎన్‌బీఎఫ్‌సీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 94.36 శాతం వాటా కలిగి ఉంది. ఈక్విటీ జారీ నిధులను టైర్-1 మూలధన పటిష్టతకు వెచ్చించనుంది.

**రూ. 5,000 కోట్లకు రెడీ**

డార్ఫ్-కెటల్ కెమికల్స్ ఐపీవోలో రూ. 1,500 కోట్ల విలువైన ఈక్విటీని జారీ చేయనుంది. మరో రూ. 3,500 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ సంస్థ మెనన్ ఫ్యామిలీ హోల్డింగ్స్ ట్రస్ట్ విక్రయానికి ఉంచనుంది. తద్వారా రూ. 5,000 కోట్లు సమకూర్చుకోనుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 829 కోట్లు రుణ చెల్లింపులకు, రూ. 333 కోట్లు అనుబంధ సంస్థలో పెట్టుబడికి వెచ్చించనుంది.

**సోలార్ మాడ్యూల్ సంస్థ**

ఐపీవోలో విక్రమ్ సోలార్ రూ. 1,500 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 17.45 మిలియన్ షేర్లను ప్రమోటర్, ప్రమోటర్ గ్రూప్ సంస్థలు విక్రయించనున్నాయి. ఐపీవో నిధుల్లో రూ. 793 కోట్లు అనుబంధ సంస్థ వీఎస్ఎల్ గ్రీన్ పవర్ పెట్టుబడి వ్యయాలకు కేటాయించనుంది. తద్వారా 3,000 మెగావాట్ల సోలా ర్ సెల్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది.

**లాజిస్టిక్స్ సొల్యూషన్ల సంస్థ**

షిప్పింగ్, లాజిస్టిక్స్‌సొల్యూషన్లు అందించే శ్రీజి షిప్పింగ్ గ్లోబల్ ఐపీవోలో భాగంగా 2 కోట్ల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. ప్రధానంగా డ్రై బల్క్ కార్గోకు సేవలందించే కంపెనీ ఇష్యూ నిధుల్లో రూ. 289 కోట్లు సూపర్‌మ్యాక్స్ విభాగంలో సెకండరీ మార్కెట్ నుంచి డ్రై బల్క్ క్యారియర్స్ కొనుగోలుకి వెచ్చించనుంది. మరో రూ. 20 కోట్లు రుణ చెల్లింపులకు కేటాయించనుంది.

**ఏవన్ స్టీల్స్ ఇండియా సై**

ఐపీవోలో భాగంగా ఏవన్ స్టీల్స్ ఇండియా రూ. 600 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 50 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థ వన్యా స్టీల్స్‌లో పెట్టుబడులకు వినియోగించనుంది. తద్వారా మెషీనరీ కొనుగోలు, తయారీ సామర్థ్య విస్తరణ, విద్యుత్ యూనిట్ ఏర్పాటు, రుణ చెల్లింపులు చేపట్టనుంది.

**బంగారు ఆభరణ కంపెనీ**

పబ్లిక్ ఇష్యూలో భాగంగా బంగారు ఆభరణాల తయారీ కంపెనీ శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ 1.8 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. ఇష్యూ నిధుల్లో రూ. 46 కోట్లు జైపూర్ యూనిట్ ఏర్పాటుకు వెచ్చించనుంది. మరో రూ. 190 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, రూ. 20 కోట్లు రుణ చెల్లింపులకు కేటాయించనుంది.








# చైనీస్ దోశ లాంటిది ఆధునిక ప్రేమ!

మీరు ఎవరితోనైనా జీవితాంతం బతకాలనుకుంటే.. వారితో మళ్లీ మళ్లీ ప్రేమలో పడాలి' అంటూ 'మెట్రో ఇన్ దినో' ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేసింది బాలీవుడ్ నాయిక సారా అలీఖాన్. ఆమె,ఆదిత్యరాయ్ కపూర్ జంటగా నటించిన చిత్రమిది. "మీరు ఎవరితోనైనా జీవితాంతం బతకాలనుకుంటే.. వారితో మళ్లీ మళ్లీ ప్రేమలో పడాలి" అంటూ 'మెట్రో ఇన్ దినో' ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేసింది బాలీవుడ్ నాయిక సారా అలీఖాన్. ఆమె, ఆదిత్య రాయ్ కపూర్ జంటగా నటించిన చిత్రమిది. అనురాగ్ బసు దర్శకత్వం వహించారు. ఈ సినిమా వచ్చే నెల 4న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమంలో భాగంగా ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. "ప్రేమ అందరూ అనుకున్నంత సులభం కాదు. ఇందులో చాలా కోణాలుంటాయి. ఇప్పుడు వీటన్నింటినీ 'మెట్రో ఇన్ దినో' తెరపై చూపించబోతుంద"నే వ్యాఖ్యను జోడించింది. నాలుగు జంటల మధ్య సంబంధాల్ని చూపిస్తూ ఆసక్తికరంగా సాగుతోందీ ట్రైలర్. ఇందులో 'ఆధునిక ప్రేమ చాలా గందరగోళంగా ఉంటుంది. ఇది చైనీస్ షెజ్‌వాన్ మసాల దోశ లాంటిది' అనే సంభాషణలు సినీప్రియుల్ని ఆకట్టుకుంటున్నాయి. అనుపమ్ ఖేర్, నీనా గుప్తా, అలీ ఫజల్, ఫాతిమా సనా షేక్ తదితరులు నటించిన ఈ చిత్రాన్ని టీ సిరీస్ నిర్మించింది.



# విద్యార్థులకు 'విజయ్' కానుకలు.. రాజకీయాలు వద్దంటూ సూచన

కోలీవుడ్ హీరో, తమిళగ వెట్రి కళగం నేత విజయ్ విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు. ప్రతి ఏడాది మాదిరే ఈసారి కూడా తమిళనాడు విద్యార్థులకు కానుకలు అందించారు. 2026 ఎన్నికల్లో మార్పు తథ్యమంటూ నినాదాలు హోరెత్తిస్తూనే.. చదువుకునే పిల్లలు రాజకీయ అంశాల గురించి తెలుసుకోవాలని చెప్పిన ఆయన తమ గోల్స్ పూర్తి అయ్యే వరకు వాటికి దూరంగా ఉండాలని వారించారు. ఇందుకు మహాబలిపురంలో మలివిడతగా జరిగిన విద్యా ప్రోత్సాహక కార్యక్రమం వేదికగా మారింది. పది, ప్లస్‌టూలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను విజయ్ సత్కరిస్తూ, ప్రోత్సాహాన్ని అందిస్తున్న విషయం తెలిసిందే.

మలివిడతగా మహాబలిపురంలోని ఓ రిసార్ట్‌లో 75 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన 500 మంది విద్యార్థులను సత్కరించి, ప్రోత్సాహాన్ని అందించారు. రాత్రి ఎనిమిది గంటల వరకు ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను వేదిక పైకి పిలిచి సత్కరించడమే కాకుండా, వారితో గ్రూప్ ఫొటోలను విజయ్ దిగారు. అదే సమయంలో మైక్ అందుకున్న విద్యార్థులు విజయ్ తమలో మరింత ఉత్సాహాన్ని, ఆనందాన్ని నింపుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. 2026 ఎన్నికల్లో విజయ్ రూపంలో మార్పు తథ్యమని నినదించారు. అదే సమయంలో మైక్ అందుకున్న విజయ్ రాజకీయాలు వద్దు, విద్యాపరంగా ముందుకెళ్దామని సూచించారు. విద్యార్థులెవరూ రాజకీయాలు మాట్లాడకుండా జాగ్రత్త పడ్డారు. రాష్ట్ర స్థాయిలోని టాపర్లకు బంగారు ఉంగరాలను విజయ్ అందజేశారు. మలివిడతగా ఈనెల 13న మరో 71 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన టాపర్లను విజయ్ సత్కరించేందుకు నిర్ణయించారు.



# జయం రవి– కెనీషా ఫొటోలు వైరల్: పెళ్లంటూ చర్చ!

జయం రవి- కెనీషా ఓ దేవాలయంలో కలిసి దిగిన ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

కోలీవుడ్ హీరో జయం రవి - కెనీషా మరోసారి వార్తల్లో నిలిచారు. వారిద్దరు కలిసి దిగిన ఫొటోలు నెట్టింట చర్చనీయాంశమయ్యాయి. ఇద్దరి మెడలో పూల దండలు కనిపించడంతో.. 'పెళ్లి చేసుకున్నారా?' అంటూ పలువురు నెటిజన్లు సందేహం వ్యక్తం చేస్తున్నారు. అసలు విషయం ఏంటంటే? తన నిర్మాణ సంస్థ 'రవి మోహన్ స్టూడియోస్' లోగోను జయం రవి గురువారం సోషల్ మీడియా వేదికగా ఆవిష్కరించారు. ఈ ప్రకటనకు ముందు ఆయన, కెనీషా కలిసి చెన్నైలోని మురుగన్ దేవాలయాన్ని సందర్శించారు. దర్శనం అనంతరం.. అర్చకులతో కలిసి దిగిన ఫొటోలు వైరల్‌గా మారాయి.

భార్య ఆర్తి నుంచి తాను విడాకులు తీసుకుంటున్నట్టు జయం రవి గతేడాది ప్రకటించిన సంగతి తెలిసిందే. కెనీషాతో రిలేషన్ వల్లే ఆర్తికి డివోర్స్ ఇచ్చారంటూ కోలీవుడ్‌లో వార్తలొచ్చాయి. చెన్నైలో కొన్ని రోజుల క్రితం జరిగిన ఓ పెళ్లి వేడుకలో రవి, కెనీషా జంటగా కనిపించడంతో ఈ వార్తలకు బలం చేకూరినట్టైంది. అదే సమయంలో.. రవిని ఉద్దేశిస్తూ ఆర్తి ఎమోషనల్ పోస్టు పెట్టారు. తనకు అన్యాయం జరిగిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దానిపై రవి స్పందిస్తూ.. ఆర్తి తనను అన్ని విధాలుగా నియంత్రిస్తుందన్నారు. ఇలా ఒకరిపై ఒకరు సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. ప్రస్తుతం వీరి విడాకుల కేసు కోర్టు పరిధిలో ఉంది. తన భర్త నుంచి నెలకు రూ.40 లక్షల భరణం ఇప్పించాలని కోరుతూ ఆర్తి ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు.




# పెళ్లి కాని ప్రసాద్.. సప్తగిరి మూవీ నవ్వులు పంచిందా ?

సప్తగిరి హీరోగా తెరకెక్కిన కామెడీ డ్రామా మూవీ 'పెళ్లికాని ప్రసాద్'. ఓటీటీ 'ఈటీవీ విన్'లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ సినిమా సంగతులివీ..

హాస్య నటుడు సప్తగిరి హీరోగా తెరకెక్కిన లేటెస్ట్ మూవీ 'పెళ్లి కాని ప్రసాద్' . అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా మార్చిలో థియేటర్లలో విడుదలైంది. ప్రస్తుతం ఓటీటీ 'ఈటీవీ విన్' లో స్ట్రీమింగ్ అవుతోంది. మరి, ఈ సినిమా కథేంటి? ఎలా ఉందంటే?

ప్రసాద్ (సప్తగిరి) మలేసియాలోని ఓ స్టార్ హోటల్ మేనేజర్. 38 ఏళ్లు వచ్చినా బ్యాచిలర్‌గానే ఉంటాడు. రూ. కోట్లలో కట్నం డిమాండ్ చేసే వాళ్ల నాన్నే అందుకు కారణం. ఎట్టకేలకు ఓ సంబంధం కుదిరిందన్న ఆనందంలో ఇండియాకు తిరిగొస్తాడు ప్రసాద్. కానీ, ఆ సంబంధం క్యాన్సిల్ అవుతుంది. మరోవైపు, ప్రియ (ప్రియాంకా శర్మ) అనే అమ్మాయి విదేశంలో స్థిరపడిన వ్యక్తినే వివాహం చేసుకోవాలని, తనతోపాటు కుటుంబాన్నీ అక్కడకు తీసుకెళ్లాలని నిర్ణయించుకుంటుంది. ప్రసాద్ గురించి తెలిసిన ప్రియ.. బాల్య స్నేహితురాలిని అంటూ అతడికి దగ్గరవుతుంది. చివరకు వివాహ బంధంతో ఆ ఇద్దరు ఒక్కటవుతారు. మలేసియా వెళ్లకుండా, ఇక్కడే ఉండాలని ప్రసాద్ పెళ్లి తర్వాత ఫిక్స్ అవుతాడు. ఈ విషయం తెలిసిన ప్రియ, ఆమె కుటుంబం రియాక్షన్ ఏంటి? ప్రసాద్ ఎందుకు మలేసియా వెళ్లాలని అనుకోలేదు?పెళ్లికి ముందు.. ప్రియ ఫ్యామిలీ చేసిన మోసం గురించి ప్రసాద్‌కు తెలిశాక ఏం జరిగింది? అన్నది ఈ సినిమా కథ.

హీరోకి వయసైపోతున్నా పెళ్లికాకపోవడమన్న కాన్సెప్ట్‌తో ఇప్పటికే పలు సినిమాలు వచ్చాయి. ఈ సున్నితమైన అంశం దాదాపు అన్ని చిత్రాల్లోనూ వినోదాత్మకంగానే సాగింది. 'పెళ్లి కాని ప్రసాద్' ఆ జాబితాలోకే వస్తుంది. కథానాయకుడి తండ్రి తమ కట్నం వంశానికి చెందిన శాసనాల గ్రంథాన్ని అనుసరించి పెళ్లి చేయాలనుకోవడం, హీరోయిన్ ఫ్యామిలీ విదేశంలో సెటిల్ అవ్వాలనుకోవడం.. ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా నిలుపుతాయి. ప్రియ ఫ్యామిలీ ఎందుకు విదేశాలపై ఆసక్తి పెంచుకుంది? అక్కడ స్థిరపడిన వ్యక్తినే ప్రియ పెళ్లి చేసుకోవాలని ఎందుకు నిర్ణయించుకుంది? వంటి ప్రశ్నలకు సినిమా ప్రారంభంలోనే సమాధానాలిచ్చారు దర్శకుడు. దాంతో, తర్వాత ఏం జరగబోతోందో ప్రేక్షకుడికి అర్థమైపోతుంది. మలేసియాలో హీరో ఎంట్రీ, తండ్రితో పెళ్లి గురించి ఫోన్‌లో చర్చించడం, శాసనాల గ్రంథం ప్రస్తావన.. ఇలా సినిమా సరదాగా సాగిపోతుంది. ప్రసాద్ స్వదేశానికి తిరిగొచ్చాక ఇంకాస్త ఫన్ జనరేట్ అవుతుంది .

ఓ పెళ్లి సంబంధం రద్దయిన తర్వాత ప్రసాద్‌కు ప్రియ పరిచయమవడం, పలు హిట్ చిత్రాల కథలను చెబుతూ ప్రసాద్, తాను బాల్యంలో స్నేహితులమని నమ్మించే ప్రయత్నం చేయడం తదితర సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. కుటుంబానికి చెప్పకుండా ప్రసాద్.. ప్రియను పెళ్లి చేసుకోవడం ద్వితీయార్థంపై ఆసక్తి రేకెత్తిస్తుంది. ఫస్టాఫ్‌తో పోలిస్తే సెకండాఫ్‌లో కామెడీ అంతగా వర్కౌట్ కాలేదు. ఇతర సినిమాల్లోని డైలాగ్స్ రిఫరెన్స్‌తో క్రియేట్ చేసిన సంభాషణలు పండలేదు. ప్రసాద్ మలేసియాకు వెళ్లడన్న సంగతి ప్రియకు తెలిసినప్పటి నుంచి స్టోరీ ఎమోషనల్‌గా టర్న్ అవుతుంది. భర్త నుంచి ప్రియ విడాకులు కోరుకోవడం, కోర్టులో ప్రియపై ప్రసాద్ ప్రేమను వ్యక్తం చేయడంతో క్లైమాక్స్ భావోద్వేగభరితంగా ఉంటుందని ప్రేక్షకుడు ఊహించే అవకాశం ఉంది. కానీ, ప్రేక్షకుడి ఊహకు భిన్నంగా హాస్యంతోనే సినిమా ముగుస్తుంది.

పెళ్లి కాని ప్రసాద్‌గా సప్తగిరి అలరిస్తారు. హీరోయిన్ ప్రియాంకా శర్మ అందంతో ఆకట్టుకుంటారు. హీరో తండ్రిగా మురళీధర్ గౌడ్, హీరోయిన్ తల్లి పాత్రలో ప్రమోదిని, బామ్మగా అన్నపూర్ణ, వాళ్ల పనిమషిగా మహబూబ్ బాషా, ప్రసాద్ స్నేహితుడిగా లక్ష్మణ్ మీసాల తదితరులు నవ్వులు పంచుతారు.

కుటుంబంతో కలిసి చూడొచ్చా?: క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. కుటుంబంతో కలిసి చూడొచ్చు. నిడివి దాదాపు 2 గంటలు.

**చివరిగా:** నవ్వులు పంచే 'ప్రసాద్'!

**గమనిక:** ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టి కోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!



# నీ మంచితనం నాకు తెలుసు.. చివరిచూపు చూసుకున్న హీరోయిన్

హీరోయిన్, మెగా ఫ్యామిలీ కోడలు లావణ్య త్రిపాఠి తీవ్ర బాధలో ఉంది. ఆమె ఎంతగానో ఇష్టపడే పెంపుడు శునకం మరణించింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. నేను చూసిన శునకాల్లో అన్నింటికంటే నువ్వే ఎంతో మంచిదానివి. నీకు శక్తి ఉండుంటే నాకోసం టీ పెట్టడానికి కూడా వెనకాడవని నా చుట్టూ ఉండేవాళ్లకు ఎప్పుడూ నీ గురించి చెప్తుంటాను.

**ఎంత మంచిదానివో..**

నీదెంత మంచిమనసో నాకు తెలుసు. నువ్వు చాలా మంచిదానివి. అలాగే తెలివైనదానివి స్వీటీ అని రాసుకొచ్చింది. తన శునకంతో కలిసున్న ఫోటోలను షేర్ చేసింది. ఈ పోస్ట్ కింద సాయిదుర్గ తేజ్ ఓం శాంతి అని కామెంట్ చేశాడు. ఈ విషయం తెలిసిన అభిమానులు.. లావణ్యను ధైర్యంగా ఉండమని చెప్తున్నారు.

**త్వరలోనే తల్లి కాబోతున్న లావణ్య**

కాగా లావణ్య త్రిపాఠి, వరుణ్ తేజ్ 2023లో పెళ్లి చేసుకున్నారు. గత నెలలోనే లావణ్య.. తాను గర్భం దాల్చినట్లు గుడ్‌న్యూస్ చెప్పింది. సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం ఆమె చేతిలో సతీ లీలావతి సినిమా ఉంది.



## ఆర్సీబీ విజయోత్సవాలు అంత హడావుడిగా ఎందుకు నిర్వహించారు?: మదన్‌లాల్

చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ విజయోత్స వాల సందర్భంగా తొక్కిసలాట జరిగి 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో సరైన ప్రణాళిక లేకుండా అంత హడావుడిగా ఈ కార్యక్రమం నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందని భారత మాజీ క్రికెటర్ మదన్‌లాల్ ప్రశ్నించాడు.

ఐపీఎల్ 18వ సీజన్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజేతగా నిలిచింది. ఇదే వారికి తొలి టైటిల్. ఈ నేపథ్యంలో బుధవారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ యాజమాన్యం ఆధ్వర్యంలో విజయోత్సవాలు నిర్వహించారు. అయితే మైదానం వెలుపల తొక్కిసలాట చోటుచేసుకుని 11 మంది మృతి చెందారు. పలువురు గాయాలపాలయ్యారు.

ఈ దుర్ఘటనపై 1983 వరల్డ్ కప్ గెలిచిన నాటి భారతజట్టులో సభ్యుడైన మదన్‌లాల్ స్పందించాడు. విజయోత్సవ ఏర్పాట్లు అస్తవ్యస్తంగా ఉన్నాయంటూ ఆర్సీబీని తప్పు బట్టాడు. అంత హడావుడిగా ఈ కార్యక్రమాన్ని ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించాడు.

'మీరు గత రాత్రి అహ్మదాబాద్‌లో సంబరాలు చేసుకున్నారు. మరుసటి రోజే బెంగళూరులో గ్రాండ్ ఈవెంట్‌ను నిర్వహించడానికి ఇంత తొందరపాటు ఎందుకు? సరైన ప్రణాళిక లేకుండా ఈ కార్యక్రమం నిర్వహించడం వల్ల అనవసరంగా పదకొండు మంది తమ ప్రాణాలు కోల్పోయారు' అని మదన్ లాల్ ఆవేదన వ్యక్తం చేశాడు. చిన్నస్వామి స్టేడియంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయడంతో తమ అభిమాన క్రికెటర్లను చూడటానికి లక్షల సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. కానీ స్టేడియం సామర్థ్యం కేవలం 35 వేలు. దీంతో మైదానం వెలుపల తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 11 మంది మృతి చెందగా, దాదాపు 50 మంది గాయాలపాలయ్యారు. ఈ విషయం తెలియడంతో నిర్వాహకులు వేడుకను 20 నిమిషాలకు కుదించి, ముగించారు.

ఇది ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమం కాదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వివరణ ఇచ్చారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ విజయోత్సవం జరిగిందని తెలిపారు. బెంగళూరు జట్టు కాబట్టి తాము కార్యక్రమంలో పాల్గొన్నామని ఆయన విలేకరులతో అన్నారు.

# భారత్‌తో తొలి టెస్టు.. జట్టును ప్రకటించిన ఇంగ్లాండ్



**త్వరలో టీమ్ఇడియా ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. జూన్ 29 నుంచి ఇరుజట్ల మధ్య ఐదు టెస్టుల సిరీస్ ప్రారంభంకానుంది.**

టీమ్ఇండియా త్వరలో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. ఆతిథ్య జట్టుతో భారత్ ఐదు టెస్టులు ఆడనుంది. ఈ సిరీస్‌తోనే 20252027 డబ్ల్యూటీసీ ప్రారంభంకానుంది. ఇప్పటికే శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా 18 మందితో భారత జట్టును ఎంపిక చేశారు. జూన్ 20 నుంచి హెడింగ్లీ వేదికగా తొలి టెస్టు ప్రారంభంకానుంది. ఈ మ్యాచ్ కోసం ఇంగ్లాండ్ బెన్‌స్టోక్స్ కెప్టెన్‌గా 14 మందితో జట్టును ప్రకటించింది. పేసర్ గాస్ అట్కిన్సన్ గాయం కారణంగా జట్టుకు దూరమయ్యాడు.

**తొలి టెస్టుకు ఇంగ్లాండ్ టీమ్: బెన్ స్టోక్స్, షోయబ్ బషీర్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, బ్రైడన్ కార్స్, సామ్ కుక్, జాక్ క్రాలీ, బెన్ డకెట్, జేమీ ఒవర్టన్, ఓలీ పోప్, జో రూట్, జేమీ స్మిత్, జోష్ టంగ్, క్రిస్ వోక్స్.**

**ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌కు భారత జట్టు**

**శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శ-న్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్షదీప్ సింగ్, కుల్‌దీప్ యాదవ్.**

**సిరీస్ షెడ్యూల్ ఇదే..**

**తొలి టెస్ట్ - 2025 జూన్ 20 - 24, వేదిక: హెడింగ్లీ, లీడ్స్**
**రెండో టెస్ట్ - 2025 జులై 2 - 6, వేదిక: ఎడ్జ్‌బస్టన్, బర్మిం-గ్‌హామ్**
**మూడో టెస్ట్ - 2025 జులై 10 - 14, వేదిక: లార్డ్స్ , లండన్**
**నాలుగో టెస్ట్ - 2025 జులై 23 - 27, వేదిక: ఎమిరేట్స్ ఓల్డ్ ట్రాఫోర్డ్, మాంచెస్టర్**
**ఐదో టెస్ట్ - 2025 జులై 31 - ఆగస్ట్ 4, వేదిక: కెన్నింగ్టన్ ఓవల్, లండన్**

## బెంగళూరు తొక్కిసలాట ఘటన.. మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటించిన ఆర్సీబీ





ఆర్సీబీ విజయోత్సవాల సందర్భంగా చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతి చెందినవారి కుటుంబాలకు ఆర్సీబీ పరిహారం ప్రకటించింది.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు విజయోత్సవాల సందర్భంగా చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన 11 మంది కుటుంబాలకు ఆర్థిక సాయం చేసేందుకు ఆ జట్టు యాజమాన్యం ముందుకొచ్చింది. ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ప్రకటించింది. ఈ మేరకు తన అధికారిక ఎక్స్ పేజీలో పోస్టు చేసింది. అంతేకాకుండా ఈ ఘటనలో క్షతగాత్రులైన వారికి చికిత్స కోసం ఆర్సీబీ కేర్స్ పేరిట నిధులు సేకరించాలని నిర్ణయించింది. మరోవైపు మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున కర్ణాటక ప్రభుత్వం పరిహారం ప్రకటించిన సంగతి తెలిసిందే.

'తొక్కిసలాట వార్త తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాం. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నాం. మా అభిమానులందరూ క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నాం. మీడియాలో వచ్చిన కథనాలతో ఈ ఘటన గురించి మాకు తెలిసింది. అభిమానులు పెద్ద ఎత్తున రావడంతో ఇలాంటి ఘటన చోటు చేసుకుంది. మాకు ప్రతి ఒక్కరి క్షేమం అత్యంత కీలకం. దీని గురించి తెలిసిన వెంటనే మా కార్యక్రమాలను రద్దు చేసుకున్నాం. బాధిత కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. స్థానిక అధికారులకు మా పూర్తి సహకారం అందిస్తాం. ఈ సందర్భంగా మాకు మద్దతుగా నిలిచే వారికి ఒకటే విజ్ఞప్తి చేస్తున్నాం. అందరూ సురక్షితంగా ఉండాలని కోరుకుంటున్నాం'' అని ఆర్సీబీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

## ఇంగ్లాండ్ టూర్‌లో బుమ్రాకు రెస్ట్.. గంభీర్ ఏమన్నాడంటే?



**త్వరలో టీమ్ఇండియా ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ సిరీస్‌కు ఎంపికైన జస్‌ప్రీత్ బుమ్రా .. ఫిట్‌నెస్ సమస్యలు, వర్క్‌లోడ్ కారణంగా అన్ని మ్యాచులూ ఆడడు.**

టీమ్ఇండియా త్వరలో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. ఆతిథ్య జట్టుతో జూన్ 20 నుంచి ఐదు టెస్టుల సిరీస్‌లో తలపడనుంది. ఇప్పటికే శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా 18మందితో భారత జట్టును ఎంపిక చేశారు. ఈ సిరీస్‌కు ఎంపికైన జస్‌ప్రీత్ బుమ్రా .. ఫిట్‌నెస్ సమస్యలు, వర్క్‌లోడ్ కారణంగా అన్ని మ్యాచులూ ఆడలేడని చీఫ్ కోచ్ అజిత్ అగార్కర్ జట్టు ఎంపిక సందర్భంలోనే స్పష్టం చేశాడు. ఇదిలా ఉండగా.. మరి కొన్ని రోజుల్లోనే టీమ్ఇండియా ఇంగ్లాండ్‌కు బయలుదేరనుంది. ఈ నేపథ్యంలో గురువారం కెప్టెన్ శుభ్‌మన్ గిల్ , ప్రధాన కోచ్ గంభీర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బుమ్రా ఎన్ని మ్యాచ్‌లు ఆడతాడనేది ఇంకా నిర్ణయించలేదని, మ్యాచ్‌ల ఫలితాలను బట్టి నిర్ణయం ఉంటుందన్నాడు. ఆర్సీబీ విజయోత్సవాల సందర్భంగా చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట అంశం గురించి కూడా గంభీర్ మాట్లాడాడు.

'బుమ్రా లేని లోటును భర్తీ చేయడం ఎప్పుడూ కష్టమే. కానీ, మాకు నాణ్యమైన బౌలర్లు అందుబాటులో ఉన్నారు. బుమ్రాకు ఏ మ్యాచ్‌ల్లో విశ్రాంతి ఇవ్వాలనేది ఇంకా నిర్ణయించలేదు. ఇది మ్యాచ్‌ల ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. ఇంగ్లాండ్‌లో మైదాన పరిస్థితులతో పాటు వాతావరణం కూడా చాలా కీలకమైనది. మేము అన్ని అంశాల ఆధారంగా అత్యుత్తమ తుది జట్టును ఎంచుకుంటాం. టెస్టు మ్యాచ్‌లో 1000 పరుగులు చేసినా విజయం దక్కుతుందని చెప్పలేం. కానీ, 20 వికెట్లు పడగొట్టడం కచ్చితంగా మ్యాచ్ గెలవడానికి సహాయపడుతుంది.

దేశవాళీ క్రికెట్‌లో రాణించే వారికి జాతీయ జట్టులోకి రావడానికి తలుపులు ఎప్పటికీ తెరిచే ఉంటాయి. కరుణ్ నాయర్ అనుభవం జట్టుకు కచ్చితంగా ఉపయోగపడుతుంది. అతను మంచి ప్రదర్శన చేస్తాడని ఆశిస్తున్నాం' అని గంభీర్ వివరించాడు. ఆర్సీబీ విజయోత్సవాల సందర్భంగా బెంగళూరులో జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోవడంపై గంభీర్ తీవ్ర విచారం వ్యక్తం చేశాడు. ఇలాంటి ప్రజల జీవితాలను ప్రమాదంలో పడేస్తాయని, అందుకే విజయోత్సవ కార్యక్రమాల కోసం రోడ్‌షోలు నిర్వహించడాన్ని తాను ఎప్పుడూ సమర్థించనని పేర్కొన్నాడు.

## కాస్త ముందుగానే ఇంగ్లండ్‌కు కేఎల్ రాహుల్!



**ఇంగ్లండ్ పర్యటనకు ముందు టీమ్ఇండియా దిగ్గజ ఆటగాళ్లైన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత జట్టులో కేఎల్ రాహుల్ కీలక ఆటగాడిగా మారనున్నాడు.**

ఇంగ్లండ్ పర్యటనకు ముందు టీమ్ఇండియా దిగ్గజ ఆటగాళ్లైన రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో భారత జట్టులో కేఎల్ రాహుల్ కీలక ఆటగాడిగా మారనున్నాడు. జూన్ 20 నుంచి టీమ్ఇండియా ఇంగ్లండ్‌తో అయిదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. ఈ సిరీస్‌లో రాణించాలని కేఎల్ రాహుల్ కృతనిశ్చయంతో ఉన్నాడు. ఈనేపథ్యంలో ఇంగ్లండ్ పరిస్థితులకు అలవాటుపడేందుకు ప్రధాన భారత జట్టు కంటే కాస్త ముందుగానే కేఎల్ రాహుల్ ఇంగ్లండ్‌కు చేరుకోనున్నాడు. ఈ బ్యాటర్ గతంలో ఆ జట్టు మీద రెండు సెంచరీలు బాదాడు. రాహుల్ ఇప్పటివరకు 58 టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. టెస్టుల్లో అతడి యావరేజ్ 33.57. టీమ్ ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ , ఇతర జట్టు సభ్యులు ముంబయి నుంచి ఆలస్యంగా బయలుదేరి వెళ్లనున్నారు. నిజానికి గిల్, సాయిసుదర్శన్ ఇంగ్లండ్‌లో సన్నాహక టెస్టు మ్యాచ్ ఆడతారని అంతా అనుకున్నారు. కానీ ఐపీఎల్ మ్యాచ్‌ల వల్ల అది సాధ్యం కాలేదు. దీంతో వారు ప్రధాన టెస్ట్ సిరీస్‌కు ముందు ఇంట్రా స్క్వాడ్ గేమ్‌లో మాత్రమే ఆడనున్నారు. అలాగే ఇండియా ఎ జట్టు శుక్రవారం నుంచి ఇంగ్లండ్ లయన్స్‌తో రెండో, చివరి అనధికారిక టెస్టు ఆడనుంది. మొదటి అనధికారిక టెస్టులో ఆడని ఆకాశ్ దీప్ రెండో మ్యాచ్‌లో ఆడే అవకాశం ఉంది. డ్రాగా ముగిసిన మొదటి అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో కరుణ్‌నాయర్ డబుల్ సెంచరీ చేసిన విషయం తెలిసిందే.

**ఇండియా ఎ జట్టు: అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కరుణ్ నాయర్, ధ్రువ్ జురేల్ (వికెట్ కీపర్), నితీశ్ కుమార్ రెడ్డి, శార్దూల్ ఠాకూర్, ఇషాన్ కిషన్, మానవ్ సుతార్, తనుష్ కోటియన్, ముఖేశ్ కుమార్, అకాశ్ దీప్, హర్షిత్ రాణా, అన్షు ల్ కాంబోజ్, ఖలీల్ అహ్మద్, రుత్‌రాజ్ గైక్వాడ్, సర్ఫరాజ్ ఖాన్, తుషార్ దేశ్ పాండే, హర్ష్ దూబె**

**ఇంగ్లండ్ లయన్స్ జట్టు: జేమ్స్ రెవ్స్ (కెప్టెన్, వికెట్ కీపర్), పర్హాన్ అహ్మద్, జోర్డాన్ కాక్స్, రాకీ ఫ్లింటాఫ్, ఎమిలియొగే, టామ్ హైన్స్, జార్జ్ హిల్, మాక్స్ హోల్డెన్, బెన్ మెకిన్నీ, ఎడ్డీ జాక్, అజిత్ సింగ్ డేల్, జోష్ టంగ్, క్రిష్ వోక్స్**



## క్వార్టర్ ఫైనల్లో భారత మహిళల ఆర్చరీ జట్టు

అంటాల్యా (తుర్కియే): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-3 టోర్నమెంట్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో భారత క్రీడాకారులు రాణించారు. మహిళల కాంపౌండ్ విభాగంలో మధుర ధమాంగావ్‌కర్ (మహారాష్ట్ర), తనిపర్తి చికిత (తెలంగాణ), వెన్నం జ్యోతి సురేఖ (ఆంధ్రప్రదేశ్)లతో కూడిన భారత జట్టు నేరుగా క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. కజకిస్తాన్, బ్రిటన్ జట్ల మధ్య జరిగే మ్యాచ్ విజేతతో క్వార్టర్ ఫైనల్లో భారత్ తలపడుతుంది.

క్వాలిఫయింగ్‌లో భారత జట్టు ఓవరాల్‌గా 1777 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచింది. మధుర 600 పాయింట్లతో నాలుగో స్థానంలో, చికిత 592 పాయింట్లతో 11వ స్థానంలో, జ్యోతి సురేఖ 585 పాయింట్లతో 19వ స్థానంలో నిలిచారు.

పురుషుల రికర్వ్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్ 572 పాయింట్లు స్కోరు చేసి 13వ స్థానాన్ని దక్కించుకున్నాడు. భారత్‌కే చెందిన అతాను దాస్ 570 పాయింట్లతో 17వ స్థానంలో, పార్థ్ సాలుంఖే 565 పాయింట్లతో 26వ స్థానంలో నిలిచారు. ఓవరాల్‌గా భారత్ 1707 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచి రెండో రౌండ్‌కు అర్హత పొందింది.



## సెమీస్‌లో సబలెంకా

**క్వార్టర్ ఫైనల్లో ఎనిమిదో సీడ్ కిన్‌వెన్ జెంగ్‌పై గెలుపు**
**ఫైనల్లో చోటు కోసం స్వియాటెక్‌తో పోరు**

**పారిస్:** కెరీర్‌లో నాలుగో గ్రాండ్‌స్లామ్ టైటిల్ దిశగా ప్రపంచ నంబర్‌వన్, బెలారస్ స్టార్ సబలెంకా మరో అడుగు ముందుకు వేసింది. టెన్నిస్ సీజన్ రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఫ్రెంచ్ ఓపెన్‌లో టాప్ సీడ్ సబలెంకా రెండోసారి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. పారిస్ ఒలింపిక్స్ చాంపియన్, ఎనిమిదో సీడ్ కిన్‌వెన్ జెంగ్ (చైనా)తో మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సబలెంకా 7-6 (7/3), 6-3తో గెలుపొందింది. 1 గంటా 57 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకాకు గట్టిపోటీ ఎదురైంది.

తొలి సెట్‌లో ఒకదశలో సబలెంకా 2-4తో వెనుకబడింది. అయితే ఏడో గేమ్‌లో కిన్‌వెన్ తడబడి అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకుంది. కిన్‌వెన్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన సబలెంకా ఆ తర్వాత తన సర్వీస్‌ను నిలబెట్టుకొని స్కోరును 4-4తో సమం చేసింది. అనంతరం ఇద్దరూ తమ సర్వీస్‌లను కాపాడుకోవడంతో స్కోరు 6-6తో నిలిచింది. టైబ్రేక్‌లో సబలెంకా జోరు కనబరిచి సెట్‌ను సొంతం చేసుకుంది.

రెండో సెట్‌లో సబలెంకా ఏడో గేమ్‌లో, తొమ్మిదో గేమ్‌లో కిన్‌వెన్ సర్వీస్‌లను బ్రేక్ చేసి అదే జోరులో విజయాన్ని ఖరారు చేసుకుంది. మ్యాచ్ మొత్తంలో సబలెంకా ఆరు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. 20 విన్నర్స్ కొట్టిన ఈ బెలారస్ స్టార్ 18 అనవసర తప్పిదాలు చేసింది. నెట్ వద్దకు 14 సార్లు దూసుకొచ్చి ఎనిమిది సార్లు పాయింట్లు గెలిచింది. మరోవైపు కిన్‌వెన్ ఐదు ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. 22 విన్నర్స్ కొట్టిన ఈ చైనా స్టార్ 31 అనవసరతప్పిదాలు చేసింది.

సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్)తో సబలెంకా తలపడుతుంది. మరో క్వార్టర్ ఫైనల్లో స్వియాటెక్ 6-1, 7-5తో 13వ సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్)పై విజయం సాధించింది. 1 గంటా 41 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో స్వియాటెక్ మూడు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. ఫ్రెంచ్ ఓపెన్‌లో స్వియాటెక్‌కిది వరుసగా 26వ విజయం. 2022, 2023, 2024లలో విజేతగా నిలిచిన స్వియాటెక్ టైటిల్ నిలబెట్టుకోవడానికి రెండు విజయాల దూరంలో ఉంది.

**సెమీస్‌లో ముసెట్టి**

పురుషుల సింగిల్స్ విభాగంలో ఎనిమిదో సీడ్ లొరెంజో ముసెట్టి (ఇటలీ) సెమీఫైనల్లోకి దూసుకెళ్లగా... ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ) క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. క్వార్టర్ ఫైనల్లో ముసెట్టి 6-2, 4-6, 7-5, 6-2తో 15వ సీడ్ టియాఫో (అమెరికా)పై గెలుపొందాడు.

2 గంటల 47 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ముసెట్టి ఎనిమిది ఏస్‌లు సంధించాడు. తన ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశాడు. సోమవారం అర్ధరాత్రి తర్వాత ముగిసిన ప్రిక్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ సినెర్ 6-1, 6-3, 6-4తో 17వ సీడ్ రుబ్లెవ్ (రష్యా)పై విజయం సాధించాడు.

